
కొండపి ప్రాంతంలో పొలాలలో నిలిచిన నీటిని మోటార్‌తో వెలుపలకు పంపుతున్న దృశ్యం

జిల్లాలో తాజాగా కురిసిన అకాల వర్షం పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రత్యేకించి ప్రస్తుతం రబీ పంటలు అధిక సాగు జరిగే జిల్లా దక్షిణ, తూర్పు ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాంతంలోనే భారీవర్షాలు పడటమే అందుకు ప్రధాన కారణం. నెలరోజుల వ్యవధిలోపు వేసిన పొగాకు, శనగ పైర్లు ఉరకెత్తిపోతుండగా మినుము పైరు కుళ్లిపోతోంది. ఇక ఖరీఫ్‌లో వేసిన పొగాకు, మిర్చి, వరి పంటల దిగుబడులపైనా వర్షాల ప్రభావం కనిపిస్తోంది. వర్షాలు తెరపివ్వడంతో రైతులు పొలాల్లోకి వెళ్లి పైర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నీటిని బయటకు పంపడంతో పాటు మొక్కలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు.

నష్టం అపారం

ఉరకెత్తుతున్న పొగాకు, శనగ, కుళ్లిపోతున్న మినుము పైరు


పీసీపల్లిలో వర్షాలకు తడిసి మినుము కాయల్లోంచి వచ్చిన మొలకలు

- ఇతర పంటలపైనా వర్షాల ప్రభావం
- రూ.100 కోట్లకుపైనే పెట్టుబడి నీటిపాలు
- వాన తెరపివ్వడంతో పంట రక్షణపై రైతులు దృష్టి
- ఐదు రోజుల్లో 74.70 మి.మీ సగటు వర్షపాతం

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురిసిన వర్షం జిల్లాలో పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో, తూర్పు, దక్షిణప్రాంతంలో రబీ సీజన్‌లో అధికంగా పంటలు సాగు చేస్తారు. అలా నెలరోజులుగా తూర్పు, దక్షిణ ప్రాంతాలైన ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కనిగిరి, కొండపి నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో విస్తారంగా పొగాకు, శనగ సాగు జరుగుతుండగా కొన్నిచోట్ల రబీ ఆరంభంలోనే మినుము, అలసంద, వరి నాట్లు వేశారు. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ఇటీవల కురిసిన వర్షాలతో 50వేల ఎకరాల విస్తీర్ణంలో పైర్లు దెబ్బతినగా సగటున ఎకరాకు రూ.20వేల వంతున చూసినా రూ.100 కోట్ల మేర రైతాంగం పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో డిసెంబరులో పెద్దగా వర్షాలు ఉండవు. వర్షాల సీజన్ ముగిసి మంచు, చలి ప్రారంభమవుతుంది. ఈ నెల మొత్తం మీద జిల్లాలో సాధారణ సగటు వర్షపాతం 45.10 మి.మీ. అయితే ఊహించని రీతిలో ఐదు రోజుల్లో ఏకంగా 74.70 మి.మీ నమోదైంది. అందులో తూర్పు, దక్షిణ ప్రాంతంలోని దాదాపు పది, పన్నెండు మండలాల్లో 100 నుంచి 200 మి.మీ నమోదైంది. ఇతర ప్రాంతాల్లోనూ ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

పైర్లన్నీ నీళ్లలోనే..

కాగా అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో పొగాకు లేత తోటలు, తాజాగా వేసిన నాట్లు అలాగే శనగ పంట మొలక వచ్చి ఉన్నాయి. కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలలో ముదురు పొగతోటలు, అలాగే మినుము కాయదశలో ఉన్నాయి. అలాంటి పంటలన్నీ దెబ్బతిన్నాయి. లేత పొగతోటలు, తాజాగా వేసిన మొక్కలు ఉరకెత్తిపోతుండగా శనగ నీళ్లలోనే నాని పోతోంది. మినుము కాయ నాని పగిలి విత్తనాలు కుళ్లిపోతుండగా ముదురు పొగతోటలు మడ్డికారి నాణ్యత పోతోంది. ఇక కోతకు వచ్చిన వరి, మిర్చి, కంది పంటలకు నష్టం వాటిల్లింది. అధికారిక ప్రాథమిక అంచనా ప్రకారం.. జిల్లాలో పది మండలాల్లోని 103 గ్రామాల్లో సుమారు 26వేల ఎకరాలలో పంటలు దెబ్బతిని 7,650 మంది రైతులు నష్టపోయారు. అవన్నీ గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లోనివే. పంట చేతి కొచ్చే దశలో ఉండి దెబ్బతిన్న వాటినే అధికారులు అంచనా వేశారు.

నీటిని బయటకు పంపేందుకు రైతుల ప్రయత్నాలు


పొలంలోని నీటిని వాలు కాలువల ద్వారా నీటిని వెలుపలకు పంపుతున్న రైతు దర్నాశి శ్రీనివాసరావు

కొండపి: భారీవర్షాలకు పొగాకు, శనగ పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. గడచిన పది రోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలతో భూమి పదునెక్కింది. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షంతో పొలాలు పూర్తిగా నీట మునిగాయి. చేలల్లో నిలిచిన నీటిని వెలుపలకు పంపే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొండపి మండలం ముప్పవరం వద్ద ఓ రైతు చిన్న మోటార్ పెట్టి పొగాకు తోటలోని నీటిని వెలుపలకు పంపింగ్ చేస్తున్నాడు. అదేవిధంగా పెరిదేపి వద్ద కౌలుకు తీసుకుని పొగాకు వేసిన మిట్టపాలెం గ్రామానికి చెందిన దర్నాశి శ్రీనివాసరావు తన పొలంలో వాలు కాలువలు తీసి నీటిని వెలుపలకు పంపే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పొలాల్లోకి చేరిన నీటిని బయటకు పంపుతున్నానని, శుక్రవారం పగలంతా ఎండ కాయడంతో పొగ మొక్కలు, శనగ మొక్కలు ఉరకెత్తి పోతున్నాయని శ్రీనివాసరావు వివరించారు

లెక్కలోకి రాని లేతతోటలు

లేత పొగతోటలు, తాజాగా వేసిన నాట్లు, శనగ మొలక వచ్చిన భూములు కొండపి, ఎస్ఎన్‌పాడు, ఒంగోలు నియోజకవర్గాలు అలాగే దర్శి వైపాలెం నియోజకవర్గాల్లో వరి, మిర్చిపై అధికారులు దృష్టిపెట్టలేదు. వాటిన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే ఎంత తక్కువ చూసినా కనీసం 50వేల ఎకరాలలో పంటలు దెబ్బతిని సుమారు రూ.100 కోట్ల మేర పెట్టుబడులు నీటి పాలయ్యాయి. ఉరకెత్తిన పొగతోటలు, నీళ్లలో నానిపోయిన శనగ పైర్లు తిరిగి వేసుకోవాల్సి ఉండగా ఇతర పంటలపై వర్షాల ప్రభావంతో దిగుబడులు తగ్గి రైతులు నష్టపోనున్నారు. కాగా శుక్రవారం వర్షం తెరపి ఇవ్వడంతో పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపి పంటలను కాపాడుకునే వైపు రైతులు దృష్టిసారించారు. అయితే మళ్లీ వర్షం పడితే మొత్తం పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల పరిశీలన

బేస్తవారపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పైర్లను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పరిశీలించారు. శుక్రవారం మండలంలోని పూసలపాడులో మినుము పైరును ఆయన పరిశీలించారు. పూత పిందె రాలడాన్ని గమనించినట్లు తెలిపారు. సలకలవీడులో శనగ పంటను పరిశీలించారు. రైతులు పురుగుమందుతోపాటు మల్టీకే పైపాటుగా స్ప్రే చేయాలన్నారు. రైతులు తప్పనిసరిగ్గా పంట నమోదు చేసుకోవాలన్నారు. దీంతో పాటు శనగ, మినుము, మిర్చి, జొన్న, మొక్కజొన్న పంటలకు బీమా చేయించాలని రైతులకు సూచించారు. ఈ నెల15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాన్నారు. ఏడీఏ డి.బాలాజీనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారులు శ్రీనివాసనాయక్, షేక్.మహబూబ్‌బాషా, ఏవో జక్కం మేర్సీ పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


డ్వామా సిబ్బందిని వివరాలు అడుగుతున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు బృందం

శీనారెడ్డి అక్రమాలపై విచారణ ప్రారంభం

- డ్వామా కార్యాలయంలో లోకేశ్వరరావు బృందం విచారణ

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పూర్వ పీడీ కే.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో కమిటీ విచారణ ప్రారంభించింది. ఆయనతోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులైన సెర్ప్ సీఈవో శ్రీమన్నారాయణలు శుక్రవారం డ్వామా కార్యాలయంలో ఈ విచారణను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో డ్వామా పీడీగా శీనారెడ్డి 2014-19 మధ్య దాదాపు నాలుగేళ్లు పనిచేశారు. సహకార శాఖకు చెందిన ఆయన డిప్యుటేషన్‌పై అందులో పనిచేశారు. జిల్లా వాసి అయిన శీనారెడ్డి నాటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో ఇష్టారీతిన వ్యవహరించాడన్న విమర్శలు వచ్చాయి. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఈదర మోహన్ ప్రభుత్వానికి శీనారెడ్డిపై పలు ఫిర్యాదులు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ ఒకవైపు సాగుతుండగా పొదిలికి చెందిన మహిళా న్యాయవాది ఒకరు వేసిన పిటిషన్‌పై లోకాయుక్త విచారణలో ఉంది. మరోవైపు జిల్లాకు చెందిన మరో నలుగురైదుగురు వివిధ రూపాలలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఫిర్యాదుల వెల్లువ

అలాగే శీనారెడ్డి అక్రమాలపై జిల్లాకు చెందిన మంత్రి స్వామితోపాటు పలువురు ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వెళ్ళాయి. ఇలా పలు వైపుల నుంచి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు చేరడంతో వాటన్నింటిపై సమగ్రంగా విచారణ నిర్వహించి నివేదించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను గ్రామీణాభివృద్ధి ఉన్నతాధికారులు ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి శంకరనారాయణరెడ్డి, సెర్ప్ సీఈవో శ్రీమన్నారాయణలను కమిటీగా కలెక్టర్ నియమించారు. దీంతో ఆ కమిటీ విచారణ ప్రారంభించింది. లోకేశ్వరరావు, శ్రీమన్నారాయణలు డ్వామా కార్యాలయానికి శుక్రవారం వెళ్లారు. రెవెన్యూ సదస్సులకు చీమకుర్తి మండలానికి స్పెషలాఫీసర్ అయిన ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్ చీమకుర్తికి వెళ్లగా డ్వామా కార్యాలయంలోని పలువురు సూపరింటెండెంట్లను పిలిచి విచారణ కమిటీ సభ్యులు మాట్లాడారు. ప్రధానంగా డ్వామా పీడీ శీనారెడ్డి ఎంతకాలం పనిచేశారు, కార్యాలయంలో ఏఏ విభాగాలు ఉన్నాయి, ఆ సంస్థ ద్వారా అమలు చేసే పథకాలు, సంబంధిత విభాగాల పర్యవేక్షకుల వివరాలు సేకరించారు. అలాగే ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల పరిశీలనకు అనుగుణంగా అవసరమైన ఫైళ్లు ఏ విభాగంలో ఏమేమి అవసరం అన్న అంశాలను వారికి వివరించి వాటిని అందజేయాలని సూచించారు.


ఒంగోలు బాలాజీనగర్‌లోని స్కూల్లో బాలికల ఆటపాటలు

సరికొత్త ఒరవడి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలోని 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది.



ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మారిటోరియం బోర్డుచైర్మన్ దామచర్ల సత్య, కలెక్టర్ అన్సారియా, మేయర్ తదితరులు (ఇన్‌సెట్లో) సెల్యూట్ చేస్తున్న ఎస్పీ దామోదర్

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

జిల్లావ్యాప్తంగా వర్ధంతిని నిర్వహించిన విభిన్న వర్గాలు

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వపరంగా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అలాగే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణం, పల్లె తేడా లేకుండా అనేక ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఆయా పార్టీలు, సంఘాల నేతలు పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎన్‌పాడులో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పాల్గొనగా కనిగిరిలో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, వైపాలెంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.తులసీరెడ్డి, ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, లింగంగుంటలో జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ దామోదర్, అలాగే ఇతర ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కార్యక్రమాలను నిర్వహించారు. దేశ ప్రజల కోసం డాక్టర్ అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడుతూ అధికారులు, అధికార

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభం
- ఇలపావులూరులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా
- తొలిరోజు మండలానికి ఒక గ్రామంలో నిర్వహణ
- వచ్చేనెల 8వతేదీ వరకు కార్యక్రమం
- ఆయా ప్రాంతాల్లో హాజరైన పలువురు ఎమ్మెల్యేలు
- అర్జీలకు నిర్దిష్ట పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో వస్తున్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 8 వరకు సాగనున్న ఈ కార్యక్రమాన్ని చీమకుర్తి మండలం ఇలపావులూరులో కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. మండలం యూనిట్‌గా తహసీల్దార్ నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు రోజుకు ఒక పంచాయతీలో సదస్సు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. జిల్లాలో మొత్తం 826 రెవెన్యూ గ్రామాలు ఉండగా అన్నింటిలోను ఈ తరహా సదస్సులు జరగనున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వీటిని నిర్వహించాల్సి ఉండటంతో మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లా స్థాయి అధికారులను నియమించారు. అలా కీలకమైన రెవెన్యూ అధికారులతో పాటు సర్వే ఇతర సంబంధిత శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ సదస్సులు ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

హాజీపురం సదస్సులో పాల్గొన్న ఉగ్ర


ఇలపావులూరు రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

హెచ్ఎంపాడు మండలం హాజీపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొనగా మార్కాపురం మండలం పెద్దనాగులవరంలో అలాగే తర్లుపాడు మండలం బుడపల్లెలో జరిగిన సదస్సులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాచర్ల మండలం ఆకవీడులో జరిగిన సదస్సులో పాల్గొనగా, వైపాలెం నియోజకవర్గంలోని మురారిపల్లి సదస్సులో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొనగా. మద్దిపాడు మండలం లింగంగుంటలో జేసీ గోపాలకృష్ణ పాల్గొనగా ఆర్డీవోలు, స్పెషల్ ఆఫీసర్లు వారి వారి ప్రాంతాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి భూ సమస్యలపై అధికంగానే అర్జీలు అధికారులకు అందుతున్నాయి.

భూసమస్యలపై భారీగా అర్జీలు

కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్‌లు పాల్గొన్న ఇలపావులూరు చిన్న గ్రామమే అయినప్పటికి అక్కడ సదస్సులో 41 అర్జీలు అందాయి. ఇలాగే అన్ని గ్రామాల్లోనూ అర్జీలు అధికంగానే వచ్చాయి. జిల్లాలో రీసర్వే జరిగిన 298 గ్రామాల్లో భూసమస్యలపై గతంలోనే అధికారులకు వేలాది అర్జీలు అందాయి. అలాగే వారం వారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో భూసంబంధ అంశాలే అధికంగా వస్తున్నాయి. వాటి పరిష్కారానికి కూడా సదస్సుల్లో అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కాగా ప్రస్తుతం జరుగుతున్న సదస్సుల్లో రీసర్వేలో తప్పులు, ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం నమోదు చేసిన వాటిలో విస్తీర్ణంలో తేడాలు, పేర్లతో మార్పులు, అసైన్డ్‌భూములు, 22(ఏ) భూములు, చుక్కల భూములు జాబితాల నుంచి తొలగింపులు తదితర అంశాలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడ భూ అక్రమాలపైనా ఫిర్యాదులు అందుతున్నాయి. కాగా సదస్సుల్లో తమకు అందిన అర్జీలను కేటగిరీల వారీగా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తక్షణం పరిష్కారానికి అవసరం ఉన్న వాటిని అక్కడే పరిష్కారం చేయడం, లేని వాటికి రశీదులు ఇచ్చి నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కారం చేసేలా సదస్సులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వం ఇటీవల తెచ్చిన భూ దురాక్రమణ చట్టపరిధిలోకి వచ్చే అంశాలు కూడా వీటిలో దృష్టిసారించనున్నారు.

నేర వార్తలు

కత్తిపోట్లకు గురై వివాహిత మృతి



మృతిచెందిన సుహాసిని

గిద్దలూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతి దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని రజకవీధిలో చోటుచేసుకొంది. వివాహేతర సంబంధం నేపథ్యం ప్రియుడే ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాచర్లకు చెందిన పి.సుహాసిని(24)అనే యువతికి రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అనంతరం ఆమె గిద్దలూరు వచ్చి ఓ రెడీమేడ్ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. ఈ క్రమంలోనే ఆమెకు రాచర్లకు చెందిన నానీ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం గిద్దలూరుకు వచ్చాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె ఛాతిలో పొడిచాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో నాని పరారయ్యాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుహాసిని పరిస్థితి విషమంగా ఉండడంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఘటనపై మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్
- ఇలపావులూరు సదస్సుకు హాజరై వినతుల స్వీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): "ఇన్నాళ్లు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగారు. కానీ ఇపుడు రెవెన్యూ అధికారులు ప్రజల ముంగిటకు వచ్చి సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను ఊరూరా ఏర్పాటు చేసింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి." అని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. జిల్లాలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమైన తొలిరోజే శుక్రవారం చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామంలో జరిగిన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రజల నుంచి అందిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జనవరి 8వ తేదీ వరకూ జరిగే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలనుంచి అందిన వినతులను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీలకు 45రోజుల్లో శాశ్వత పరిష్కారాన్ని చూపుతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. కాగా ఇలపావులూరు ప్రజలనుంచి 151 వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వాటిలో భూసమస్యలు-39, పెన్షన్స్-39, ఇంటి స్థలాలు-46, రేషన్‌కార్డుల కోసం-26, కరెంట్ సమస్యలపై-1 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పుట్టా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థిని



సిపోరా

సింగరాయకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు పాకల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె. సిపోరా ఎంపికైంది. మహిళా జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు గత నెల 24న ఒంగోలు మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిపోరా రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ జట్టులో చోటు దక్కించుకుంది. నేటి నుంచి సంతనూతలపాడులో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

తూమాడు పంచాయతీలో అవకతవకలపై విచారణ

జరుగుమల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూమాడు గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై కనిగిరి డీఎల్పీవో శోభన్‌బాబు శుక్రవారం తూమాడు గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. గడచిన ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డీఎల్పీవో శోభన్ బాబును కలెక్టర్ విచారణాధికారిగా నియమించారు.దీంతో ఆయన శ్రీనివాసరెడ్డిని విచారించారు. ఈసందర్భంగా ఆడిట్ అభ్యంతరాలతోపాటు, నిధులను బ్యాంకు నుంచి డ్రా చేశారని, అందువల్ల సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వివరించారు. సర్పంచ్ వద్ద నుంచి డబ్బులు రికవరీ చేయడంతోపాటు ఆయన చెక్‌పవర్‌ను రద్దు చేయాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. కాగా విచారణకు ప్రస్తుత సర్పంచ్ విజయలక్ష్మి భర్త హాజరయ్యారు. విచారణాధికారి సర్పంచ్ భర్త వివరణ అక్కరలేదని, నిబంధనల ప్రకారం, ఆధారాలను పరిశీలిస్తానని వివరించారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతి విచారణాధికారిని వివరణ అడగ్గా ఆధారాలను పరిశీలిస్తున్నామని, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి అర్జీలో పేర్కొన్న అభ్యంతరాలపై లోతైన విచారణ చేస్తున్నామని, అవసరమైతే మరోసారి విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని వివరించారు.



విచారణాధికారితో మాట్లాడుతున్న కార్యదర్శి మౌనిక



విచారణాధికారితో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కన్నీటి పర్యంతమైన కార్యదర్శి

విచారణాధికారి వద్ద ప్రస్తుత కార్యదర్శి మౌనిక కన్నీటి పర్యంతమయ్యారు. తనకు నిధులు డ్రాయింగ్ పవర్ లేదని వివరించారు. తనను కొందరు పదేపదే బెదిరిస్తూ తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. విలేకరుల పేరుతో తనను వెంబడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 జూలై 18 నుంచి 2022 జూలై 7 వరకు గ్రేడ్-1 కార్యదర్శిగా ఏ.శ్రీనివాసులు పనిచేశారన్నారు. తర్వాత 2022 జూలై8 నుంచి 4.10. 2024 అక్టోబరు 4 వరకు డి. రజని అనే కార్యదర్శి పనిచేశారన్నారు. తనకు డీడీవో పవర్ ఈ ఏడాది మార్చిలో ఇచ్చినా, అక్టోబర్ నుంచి అమలులోకి వచ్చిందని మౌనిక తెలిపారు. నిధులు డ్రా చేయడంలో తన ప్రమేయం ఎక్కడ ఉన్నదని ఆమె వాపోయారు. దీనికితోడు తన కుటుంబంపై కక్షతో ఓ వ్యక్తి పదేపదే తనపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, తన కుటుంబ సభ్యులు కొనుగోలు చేసిన ఆస్తులను ప్రస్తావిస్తూ తనపై తప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈవిషయం కోర్టులో ఉన్నప్పటికీ కొందరు తనను ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తాను అన్ని ఆధారాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని విచారణాధికారి శోభన్‌బాబు హామీనిచ్చారు. ఈవోఆర్డీ కొండలరావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2004 నుంచి ఆడిట్ అధికారులు ఆడిట్ చేసినప్పటి వరకు దాదాపు రూ. 8,59,200 లకు బిల్లులు, రికార్డులు చూపించలేదని, వాటినే ఆడిట్ అధికారులు అభ్యంతరం పెట్టారని వివరించారు.

రామతీర్థం రహదారికి మోక్షం

- 1.15కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం

చీమకుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండల పరిధిలోని రామతీర్థం-మర్రిచెట్లపాలెం మధ్య అధ్వానంగా రాష్ట్ర రహదారి కర్నూల్‌రోడ్ మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత ఐదేళ్లపాటు ఈ అధ్వాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తూ వాహనదారులకు నరకప్రాయంగా మారింది. గత వైసీపీ పాలనలో రహదారికి కనీసం మరమ్మతులు కూడా నిధులు మంజూరుకు నోచుకోక వందల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. జిల్లా పశ్చిమ ప్రకాశానికి ముఖద్వారంగా ఉన్న ఈ ప్రాంతంలో అనునిత్యం వేలకొలది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక ఈప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించటంతో భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తాయి. ఈ పరిస్థితుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ తమీమ్ అన్సారియ సైతం ఇక్కడ ఉన్న ప్రమాదకర పరిస్థితులను చూసి తక్షణమే శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా రూ.1.15కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపడ, అనుమతి మంజూరు చేయటం చకచకా జరిగాయి. నిర్మాణ పనులు దక్కించుకున్న సాయినాథ కాంట్రాక్ట్ సంస్థ శుక్రవారం పనులు ప్రారంభించింది. నెలరోజుల్లోనే నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ఆ సంస్థ అధినేత మేదరమెట్ల శ్రీనివాసరావు తెలిపారు.



రోడ్డు పనుల్లో భాగంగా తోలిన మట్టికుప్పలు

మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం సాయంత్రం జేసీ గోపాలకృష్ణ అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అందుకోసం ఈగల్ వ్యవస్థను కూడా ప్రవేశపెట్టిందని చెప్పారు. జిల్లాయంత్రాంగం కూడా మరింత సమర్థవంతంగా మాదక ద్రవ్యాల కట్టడిపై దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రత్యేకంగా బంగారుబాల్యం కార్యక్రమాన్ని రూపొందించినందున మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులకు కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. శనివారం జరిగే పేరెంట్స్-టీచర్స్ సమావేశంలోనూ ఈ అంశాలను ప్రస్తావించాలని ఆదేశించారు. ఒంగోలు జీజీహెచ్‌లోని డ్రగ్స్ డీఎడిక్షన్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది ఖాళీ పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు నిఘా పెంచామని చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఖాజామొహిద్దీన్, డీఎంహెచ్‌వో పద్మజ, జీజీహెచ్ సూపరింటెండెంట్ జమున, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డీటీసీ సుశీల, సైమన్‌విక్టర్, ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 8వ తేదీన జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ సమావేశపుహాలులో పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో ఐదు పరీక్షా కేంద్రాల్లో 1,211, మార్కాపురం డివిజన్‌లో ఏడు పరీక్షా కేంద్రాల్లో 1,501 మంది, కనిగిరి డివిజన్‌లో మూడు పరీక్షా కేంద్రాల్లో 658 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ పరీక్షలు ఈనెల 8వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించిన డీఈవో

స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని డీఈవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించేందుకు ఉన్న భోజనాన్ని తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. పాఠశాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలన్నారు.



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ అన్సారియా
- చీమకుర్తి సీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంకును బీఎన్‌తో కలిసి ప్రారంభించిన కలెక్టర్

చీమకుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సూచించారు. చీమకుర్తి సీహెచ్‌సీలో రూ.20లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంకును శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం రక్తనిల్వ కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు భారీ రిఫ్రిజరేటర్లు, ఇంక్యుబేటర్, ఆటో క్లీన్ పరికరాలను, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణగోపాలరెడ్డి ఆసుపత్రికి అత్యవసరంగా అవసరమైన వసతులు గురించి వారికి విన్నవించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ విజయభాస్కర్, టీడీపీ నాయకులు సూరంపల్లి హనుమంతరావు, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పక్కన కలెక్టర్

పచ్చి మిర్చి రైతుల రాస్తారోకో

- దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని ఆగ్రహం

కొమ్మాలపాడు(అద్దంకి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దళారులు కుమ్మక్కై పచ్చి మిర్చి ధరలను రోజు రోజుకు తగ్గిస్తున్నారని సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో శుక్రవారం రాత్రి రైతులు రాస్తారోకో చేశారు. బహిరంగ మార్కెట్‌లో పచ్చి మిర్చి క్వింటా ధర 2,500 నుంచి రూ.3వేలు ఉండగా, కొమ్మాలపాడులో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై క్వింటాల్ రూ.1200 నుంచి రూ.1300కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 15 రోజులుగా వ్యాపారులు, దళారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ధరలను దిగజారుస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చి మిర్చి సాగు చేసే రైతులలో అత్యధిక శాతం చిన్న, సన్న కారు రైతులు కావడంతో పెట్టుబడులకు స్థానికంగా ఉండే ఎరువుల దుకాణాల వ్యాపారులను ఆశ్రయించడంతో ప్రస్తుతం దిగుబడి వచ్చిన మిర్చిని వ్యాపారుల కనుసన్నలలో ఉండే దళారులు ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో శుక్రవారం రాత్రి రైతులు పెద్ద సంఖ్యలో నామ్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ రెండు వైపులా నిలిచిపోయింది. పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకొని విరమింప చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, లేదంటే రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని రైతు సంఘం నేత ఖాదర్ బాషా తెలిపారు.



కొమ్మాలపాడులో నామ్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న పచ్చి మిర్చి రైతులు

అవీఇవీ

బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

- జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌లో సాగు చేసిన మిరప పంటకు దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి వై.గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సీజన్‌లో మిరప పంటకు జిల్లాలో ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా పంటల బీమా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో చేరే మిరప రైతులు ఎకరానికి రూ.525 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. బ్యాంకుల నుంచి రుణం పొందిన రైతులు తమ ఇన్సూరెన్స్ ప్రీమియంను పంట రుణం నుంచి మినహాయింపు చేస్తారన్నారు. రైతులు తమ సమీపంలో ఉన్న సీఎస్‌సీ సెంటర్ ద్వారా లేదా సమీప బ్యాంకులు, రైతులు స్వయంగా ఎన్‌సీఐపీ యాప్‌లో ఈ పంటల బీమా పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పంట నష్టపోయిన పరిస్థితుల్లో మిరప పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడిపై ఆధారపడి ఒక ఎకరానికి గరిష్ఠంగా రూ.1.05 లక్షల నష్టపరిహారం పొందవచ్చని వివరించారు. అందువల్ల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13వశతాబ్దం నాటి నాగశాసనం లభ్యం



13వ శతాబ్దం నాటి నాగశాసనం

కురిచేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో అరుదైన నాగ శాసనం వెలుగు చూసింది. గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం దగ్గర 13వ శతాబ్దం నాటి ఓ శాసనాన్ని గ్రామస్థుడు, ఆలయ ధర్మకర్త కురంగి నాగేశ్వరరావు గుర్తించారు. 10వ శతాబ్దంలో దేకనకొండలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని రాజులు నిర్మించారు. 13వశతాబ్దంలో నాగ వంశానికి చెందిన సిద్దిరాజు తిమ్మరాజు అనే రాజు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భోగమండపం నిర్మించారు. అందుకు సంబంధించి తిమ్మరాజు ఆ శాసనాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆ శాసనం ఫొటోను చరిత్ర పరిశోధకులు తురిమెళ్ళ శ్రీనివాసప్రసాద్‌కు పంపారు. ఆయన శాసనం మీది లిపిని పరిశీలించి 13వ శతాబ్దం నాటిదని గుర్తించారు. 'సిద్దిరాజు తిమ్మరాజు భోగ మండపాన్ని కట్టించారు.' అంటూ లిఖించి ఉన్నట్లు గుర్తించారు. అలాగే పదిహేను అడుగుల మూడు నాగుల శిలను కూడా ప్రతిష్ఠించారు. ఆ సందర్భంగా ఈ శాసనాన్ని వేయించినట్లు చెప్పారు. పురాతన ఆలయం పక్కనే శాసనం లభ్యం కావడంతో గ్రామస్థులంతా వచ్చి ఆసక్తిగా చూశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శరవేగంగా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

సంతనూతలపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో ఈనెల 7న సాయంత్రం ప్రారంభం కానున్న 71వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్న సూదనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, నిర్వాహకులు సూదనగుంట క్రిష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. పోటీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్రీడామైదానంలో క్రీడాకారులకు అన్నివిధాలుగా వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ స్టేట్ సెక్రటరీలు, జిల్లా సెక్రటరీలు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం

అందజేసిన టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయాన్ని బాధిత కుటుంట సభ్యులకు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామంలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన చెక్కులను అందజేసింది. బాధిత కుటుంబ సభ్యులకు టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పరామర్శించి చెక్కులను అందజేశారు. పెద్దారవీడు మండల కేంద్రానికి చెందిన ఒంటేరు నాగరాజు, సంకుల రంగారావులు కొనకనమిట్ల మండలం సిద్ధవరంలో విద్యుత్ తీగల పనులు చేస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూటమి ప్రభుత్వం వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణ సాయం అందేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ నాగేశ్వరరావు టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జెడ్డా రవి, దొడ్డా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు ఆర్టీసీ డిపోకు మంజూరైన ఆరు కొత్త బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన గిద్దలూరుకు నూతన బస్సులు రావడం సంతోషదాయకమన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డుసౌకర్యం ఉన్న మారుమూల ప్రాంతాలకు సైతం బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బస్సు డిపో ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు, మురికి కుంటను పరిశీలించి తక్షణమే వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని మేనేజర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

మనబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త ఒరవడి
- నేడు ఒకే వేదికపైకి తల్లిదండ్రులు, గురువులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు


తోరణాలు కడుతున్న విద్యార్థులు

ఆ ఊరు మనది..
ఆ వాడ మనది..
ఆ బడీ మనది..!
మన ఇంటి ముందున్న బడి బాగోగులు
మనం చూద్దాం..
మన కళ్లెదురు కనిపిస్తున్న స్కూల్
ప్రతిష్టను మరింతగా
ఇనుమడింపజేద్దాం..
ఆ చదువుల కోవెలను తీర్చిదిద్ది
భావితరాలకూ బాసటగా నిలుపుదాం..

ఇదే స్ఫూర్తితో.. ఇదే ఆకాంక్షతో చంద్రబాబు సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మమేకంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలలో పండుగ వాతావరణం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా శనివారం ఉపాధ్యాయులు, పేరెంట్స్ సమావేశాలను నిర్వహిస్తుంది.


బాలాజీనగర్‌లో స్కూలును అలంకరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా జిల్లాలోని 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించి విద్యార్థులకు స్ఫూర్తిని నింపే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా పాఠశాలల్లో జరిగే సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపారు. శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో జరిగే ఈ మీటింగ్‌కు ఏదో ఒక పాఠశాలలో పాల్గొనే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వారు ఎంపిక చేసిన పాఠశాలల్లో పాల్గొననున్నారు.


బాలాజీనగర్‌లోని స్కూలులో కోలాటం ఆడుతున్న విద్యార్థులు

● ప్రజాప్రతినిధులు హాజరయ్యే పాఠశాలలు...

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, ముండ్లపాడు హైస్కూలులో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కంచర్లవారిపల్లి జడ్పీ హైస్కూలులో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురంలో జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలో, ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రకాశం కాలనీలోని ఎంపీపీఎస్ స్కూలులో, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలు, మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి హైస్కూలులో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పాల్గొంటారు. కాగా ఆయా పాఠశాలల్లో భారీ ఏర్పాట్లను చేస్తున్నారు.


ప్రకాశం కాలనీలో స్కూలును అలంకరిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణంలో భక్తులు

కంభం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కంభం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రవణనక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. దేవస్థాన ఆవరణలో కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమాచార్య సంకీర్తన చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

9 నుంచి ఉరుసు

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్‌వలీషా దర్గాలో ఈనెల 9 నుంచి 11 వరకు 173వ ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు పఠాన్ లతీఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 9న గంధం పూజ, 10న ఉరుసు, అన్నదానం, 11న గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వొద్దుల వీరారెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిభ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 22న బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై పోరాటాలే కాకుండా చదువుల్లో ప్రోత్సహించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహి స్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

రైతులను ఆదుకోవాలి

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగడాల రంగస్వామి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో సుమారు 10వేల హెక్టార్లలో కంది, వరి, మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు పక్కాగృహాలు మంజూరు చేయాలి

కంభం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నేదురుమల్లి జయరాజ్ తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందచేశారు.

గ్రానైట్ ఓవర్ లోడ్

- 15 కంటైనర్లు నిలిపివేసిన పోలీసులు
- తనిఖీలు చేసిన మైనింగ్‌శాఖ అధికారులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిల్లులున్నప్పటికీ ఓవర్ లోడ్ పేరుతో గురువారం రాత్రి గ్రానైట్ పలకలను తరలిస్తున్న 15 కంటైనర్ లారీను పోలీసులు సంతనూతలపాడులో నిలిపివేశారు. చీమకుర్తి మండలం రాజుపాలెం, బూదవాడ, రామతీర్థం గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి చెన్నై పోర్టుకు అవి వెళ్తున్నాయి. కంటైనర్‌లో 12 నుంచి 13 క్యూబిక్ మీటర్లు అంటే సుమారుగా 4,500 చదరపు అడుగులు తరలించుకోవచ్చు. అయితే 4,200 చదరపు అడుగులకు బిల్లులు తీసుకొని అంతకన్నా అదనంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందింది. దీంతో ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పాడులో గ్రానైట్ కంటైనర్లను నిలిపివేసి తనిఖీలు చేశారు. బిల్లులు ఉన్నప్పటికి ఓవర్ లోడ్‌తో రవాణా చేస్తున్నారని వెంటనే పరిశీలించాలని మైనింగ్ అధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు శుక్రవారం మైనింగ్ అధికారులు లారీలలో ఉన్న గ్రానైట్‌ను తిరిగి తూకం వేయించారు. వారి వద్ద ఉన్న బిల్లులు సక్రమంగా ఉన్నాయా.. అని పరిశీలించారు. బిల్లులు ఉన్నప్పటికి అన్నీ ఓవర్‌లోడ్‌తో ఉన్నట్లు గుర్తించారు. బిల్లులో ఉన్న పలకల బరువుకు, ప్రస్తుతం ఉన్న బరువు తేడా అత్యంత స్వల్పమేనని మైనింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు వారు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చూడాల్సి ఉంది. కాగా తనిఖీల వ్యవహారం గ్రానైట్ పరిశ్రమలో చర్చనీయాంశమైంది.


పోలీసుల అదుపులో ఉన్న గ్రానైట్ లారీలు

15 లారీలు నిలిపివేశాం : సీఐ శ్రీకాంత్ బాబు

గ్రానైట్ అక్రమ తరలింపుపై తనిఖీలు నిర్వహించి గురువారం రాత్రి సంతనూతలపాడు వద్ద 15 లారీలను నిలిపివేశాం. వారి వద్ద ఉన్న బిల్లులు సక్రమంగా ఉన్నాయా లేదా? అని నిర్ధారణ కోసం మైనింగ్ అధికారులకు లేఖ రాశాం. మైనింగ్ అధికారులు క్లియరెన్స్ ఇస్తే వదిలేస్తాము.

మిరప పంట పరిశీలన


మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి

గిద్దలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాల నేపథ్యంలో రాచర్ల మండలం ఆకవీడులో మిరప పైరును జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపిచంద్ పరిశీలించారు. పంట పొలాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కాలువల ద్వారా వెంటనే బయటకు పంపుకోవాలన్నారు. పైపాటుగా యూరియా, 19:19:19, 13.04.45 మందులను మొక్కలకు పిచికారీ చేయాలని సూచించారు. మిరపలో తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. మిరప సాగు చేసే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.525 ప్రీమియం ఎకరాకు చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. బ్యాంక్ ద్వారా పంట సాగుకు రుణాలు తీసుకుని ఉంటే బ్యాంక్ ద్వారానే ప్రీమియం చెల్లించవచ్చన్నారు. పంట నష్టపోతే గరిష్ఠంగా ఎకరాకు 1.05లక్షల వరకు బీమా వస్తుందన్నారు. ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ, సిబ్బంది వరలక్ష్మి,మధు శంకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 1,916 అర్జీలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 1,916 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ఒంగోలు డివిజన్‌లో 488 అర్జీలు, కనిగిరిలో 375, మార్కాపురం డివిజన్‌లో 1056 అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలు 36 రకాల సమస్యలకు సంబంధించినవని చెప్పారు. మొత్తంలో 42అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈసదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని ప్రజానీకం ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పోలీస్‌శాఖలో హోంగార్డుల పాత్ర కీలకం

- ఎస్పీ దామోదర్
- ఘనంగా హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

ఒంగోలు(క్రైం), డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో హోంగార్డులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని పోలీస్‌పెరేడ్ మైదానంలో హోంగార్డుల 62 వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. పోలీసులు పని చేసే అన్ని విభాగాల్లో హోంగార్డులు పాత్ర ఉందని ప్రశంసించారు. వారి సంక్షేమం కోసం నెలకు రెండు రోజులు వేతనంతో కూడిన సెలవు ఇస్తున్నామన్నారు. జిల్లాలో 774మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తుండగా వారిలో 691 మంది పురుషులు, 83 మంది మహిళలు ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డులలో చాలామంది ప్రతిభావంతులు ఉన్నారని, విద్యార్హత ఉన్నవారు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరారు. సమాజసేవలో పోలీసులతో పాటు హోంగార్డులు అహర్నిశలు పనిచేస్తున్నారని చెప్పారు. పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన జి.హనుమంతరావుతో పాటు 14మంది హోంగార్డులకు ఎస్పీ దామోదర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రమేష్‌కృష్ణన్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీ అందజేసిన ప్రశంసాపత్రాలతో హోంగార్డులు

పదేపదే అదే రైస్‌మిల్లు..!

- రేషన్‌మాఫియాకు అడ్డాగా ఉప్పుగుండూరు
- దాడులు జరుగుతున్నా ఆగని బియ్యం దందా

నాగులుప్పలపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ సెంటర్ వద్ద మట్టిగుంటరోడ్డులో ఉన్న రైస్‌మిల్ అడ్డాగా మారింది. రేషన్‌మాఫియా తమ వ్యాపారాన్ని కొనసాగించేందుకు సదరు రైస్‌మిల్లును లీజుకు తీసుకొని తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు అక్రమ రేషన్‌బియ్యం వ్యాపారాన్ని ఉప్పుగుండూరులోని అదే రైస్‌మిల్లు ద్వారా కొనసాగించారు. అప్పట్లోనే అనేకసార్లు దానిపై విజిలెన్, పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి భారీ ఎత్తున నిల్వ చేసిన రేషన్‌బియ్యం బస్తాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకొన్నారు. ఉప్పుగుండూరులో గత వైసీపీ ప్రభుత్వం నుంచి రేషన్ మాఫియాకు అడ్డాగా మారిన అదే రైస్ మిల్లును తాజాగా కొందరు వ్యక్తులు లీజుకు తీసుకొని ఒంగోలు, చీరాలతో పాటు నాగులుప్పలపాడు మండలంలోని కొన్ని గ్రామాలలో సేకరించిన రేషన్ బియ్యాన్ని అందులోకి తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని రీపాలీష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకొంటున్నారు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి ఈ అక్రమ రేషన్‌దందా విషయాన్ని అజ్ఞాత వ్యక్తులు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. గోతాలు మార్చకుండా పెద్దఎత్తున నిల్వచేసిన రేషన్‌బియ్యం బస్తాలను గుర్తించి సీజ్‌చేశారు. ఉప్పుగుండూరులోని అదేరైస్ మిల్లులో పదేపదే అక్రమ రేషన్ బియ్యం దందాలపై దాడులు జరుగుతున్నా రేషన్ మాఫియాకు చెందిన వ్యక్తులు తమ అక్రమ వ్యాపారం కొనసాగించడం వెనక అధికార పార్టీ అండదండలతోనే జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.


అక్రమ రేషన్‌దందా జరిగే ఉప్పుగుండూరు రైస్‌మిల్లు

పట్టుబడిన రేషన్‌బియ్యం తరలింపు


సీజ్ చేసిన రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ సెంటర్ వద్ద మట్టిగుంట రోడ్డులో గల ఓ రైస్‌మిల్‌లో అక్రమంగా పెద్ద ఎత్తున దాచి ఉంచిన రేషన్‌బియ్యం బస్తాలను గురువారం రాత్రి ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న సీజ్ చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదమం డీఎస్‌వో పద్మశ్రీ, ఏఎస్‌వో పుల్లారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి రైస్‌మిల్లులో పట్టుబడిన 1,537 రేషన్ బియ్యం బస్తాలను లారీలలో ఒంగోలులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. కాగా రైస్‌మిల్లులో దాడులు జరిగిన సమయంలో 3వేల బస్తాలకు పైగా ఉన్నట్లు ప్రచారం జరిగింది. మరుసటి రోజు అధికారుల చెప్పిన లెక్కలలో వ్యత్యాసం ఉండటం పట్ల రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లుగా ప్రజలు చర్చించుకొంటున్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఘన నివాళి
- హాజరైన ఎమ్మెల్యే బీఎన్ తదితరులు

ఒంగోలు నగరం/ఒంగోలు కలెక్టరేట్/ఒంగోలు విద్య/ఒంగోలు(రూరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల, కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఆమె పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి విలువైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ సేవలను, త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పలుశాఖల అధికారులు అర్జున్‌నాయక్, లక్ష్మానాయక్, అంజల, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరరావు, దాసరి శివాజీ, చప్పిడి వెంగళరావు, సృజన్‌మాదిగ, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

ఒంగోలు(క్రైం): స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయములో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎస్పీ దామోదర్ పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, అశోక్‌బాబు, డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఏవో రామ్మోహనరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

ఒంగోలు(కల్చరల్): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. లైబ్రేరియన్ సంపూర్ణ, పాఠకులు పాల్గొన్నారు.

పలు కార్యాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో..

● స్థానిక జిల్లా వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు పి.గోపి, డీఎస్.క్రాంతికుమార్, వెంకటరెడ్డి, రొండ అంజిరెడ్డి, బొట్లా సుబ్బారావు, కఠారి ప్రసాద్, కఠారి శంకర్, మాసపల్లి రాజేష్, ముల్లంగి రవీంద్రారెడ్డి, కోటి, సురేష్‌బాబు, బత్తుల ప్రమీల, జి.మేరికుమారి, జిలానిబాషా, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

● వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పయనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ టి.సోమసుందర్ ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నక్కల వెంకటసుబ్బారావు, కోట సుధాకర్, లక్ష్మీకుమార్, కొండలరావు, రవికుమార్, అహ్మద్‌బాషా, మల్లికార్జునరావు, కొప్పోలు సుధాకర్, వెంకటరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

● రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక అంధుల పాఠశాలలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్దె త్యాగరాజు, మంద సుధాకర్, కొలకలూరి బాలాజీ, తేళ్ల జయరాజ్, కె.విజయ్‌కుమార్, పాటిబండ్ల రాజశేఖర్, బండారు సురేష్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

● ట్రిపుల్‌ఐటీ ఒంగోలు-2,3లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో డైరెక్టర్ భాస్కర్‌పటేల, ఎఫ్‌వో మీరావళి, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జై శ్రీకృష్ణ బీసీ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం వ్యవస్థాపకులు ద్రావిడదేశం కృష్ణారావు స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల గోపికృష్ణ, మల్లెబోయిన రాజు, బోడా రామకృష్ణ, బొజ్జా నరసింహారావు, చల్లా శ్రీనివాసరావు, గుమ్మా భాస్కరరావు పాల్గొన్నారు.

● స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సెమినార్‌హాలులో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, డీన్ సోమశేఖర్, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ నిర్మలామణి, పద్మజ, శ్రీనివాస్, హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

● అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కరవదిలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా త్రోవగుంట, కొప్పోలు, ఉలిచి, కరవది ఎస్సీకాలనీ. యరజర్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. వడ్డే హనుమారెడ్డి, పోలవరపు సీతారామయ్య, గద్దల రవి, కరవది హనుమంతరావు, సీహెచ్.రమేష్, పులి పరసింహారావు, గద్దె సుబ్బారావు, మూర్తి, శ్రీను పాల్గొన్నారు.



లింగంగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి జేసీ గోపాలకృష్ణ నివాళి



అంధుల పాఠశాలలో దుప్పట్లు పంపిణీ



ఏకేయూలో నివాళులర్పిస్తున్న వీసీ మూర్తి

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మద్దిపాడులో టీడీపీ నేత ఉప్పుగుండూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కడియాల రఘుబాబు, నట్టే సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ వాకా అరుణ, ఎంపీటీసీ కోటిరెడ్డి నివాళులర్పించారు. మండల అప్పారావు, మేకల కృష్ణారెడ్డి, మద్దాల లక్ష్మీనారాయణ, సింగయ్య, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్ పాల్గొన్నారు. లింగంగుంటలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జేసీ గోపాలకృష్ణ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ సంతనూతలపాడులోని ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.వి.సురేష్, ఆర్.అంకారావు, బి.శంకర్, టి.శ్రీను, కెగోపి. ఎం.శ్రీను, కె.శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని లైబ్రరీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన వర్ధంతి పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన యువకులు ర్యాలీగా తరలివచ్చి పూలమాలు వేసి నివాళులర్పించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం చీమకుర్తిలో కులనిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుడ్డు వెంకట్రావు, మాజీ చైర్మన్ కొత్రపు రాఘవరావు, కోటి, పిన్నిక శ్రీనివాసరావు, బండ్ల డేవిడ్, డేవిడ్‌రాజు, ఇస్తర్ల శంకర్, కౌన్సిలర్‌పాటిబండ్ల గంగయ్య, రాంబాబు, పోతురాజు, అంకారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐ సుబ్బారావు, పోలీసులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత జాతికి అందించిన సేవలు చిరస్మరణీయమని సీఐ హజరత్తయ్య అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదరుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి.మహేంద్ర, అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు శుక్రవారం టంగుటూరులో బహుమతులు అందించారు. రిపబ్లికన్ సొసైటీ ఫౌండేషన్ కావలి జవహర్ భారతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహించారు. డీబీఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ్రు కోటయ్య శుక్రవారం వెన్నూరులో జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి: భారతరాజ్యాంగం ప్రపంచదేశాలకే ఆదర్శప్రాయంగా నిలిచిందని పశుసంవర్థక శాఖ డీడీ రవి అన్నారు. శుక్రవారం కెల్లంపల్లిలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ జ్వాలా నరసింహం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌ల ద్వారా ఎంతోమంది ప్రజాప్రతినిధులుగా అత్యున్నత పదవులు అధిరోహించారని అన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగురైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, ఎస్సీసెల్ నాయకులు పోలయ్య, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్ ఫెస్ట్

ఒంగోలు విద్య, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో భగీరథ కెమికల్ లిమిటెడ్ హెచ్‌ఆర్ వై.రమేష్, కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మస్తానయ్య, డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ ఫెస్ట్‌లో 56 ప్రాజెక్టులను ప్రదర్శించగా అందులో ఎంపికైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి చీరాల సెయింట్ అన్స్ ఇంజనీరింగ్, ద్వితీయ బహుమతి కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు వచ్చింది. రాష్ట్ర స్థాయి ఫెస్ట్‌కు 22 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పనిచేసిన వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయున్‌బాషా డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వహయంలో పనిచేసిన వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనబకాయిలను మంజూరు చేయాలన్నారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బలవంతపు రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అంతకు ముందు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కోసం విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

ఒంగోలు విద్య, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం ఎన్‌సీసీ కోసం విద్యార్థులను ఎంపిక చేశారు. 34(ఎ) ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్‌సీసీ కోసం 77మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 40మందిని, అలాగే 65 మంది విద్యార్థినులు పాల్గొనగా 25 మందిని కమాండింగ్ ఆఫీసర్ మోహన్ పర్యవేక్షణలో సుబేదార్ మజోర్, పుష్పరాజ్‌లు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ భాస్కర్‌పటేల్, ఏవో చంద్రశేఖర్, ఎఫ్‌వో మీరావలి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ భాస్కర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కళాఉత్సవ్ బహుమతుల ప్రదానం



విజేతలతో ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు

సంతనూతలపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మైనంపాడులోని డైట్ కళాశాలలో జరిగిన కళాఉత్సవ్ పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు శుక్రవారం బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా డీఈవో కిరణ్‌కుమార్ హాజరై విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మురళీ, మల్లికార్జున, మాధవి వ్యవహరించారు.

జనసేనలో చేరిన వైసీపీ నేత

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బీసీసెల్ విభాగం అధ్యక్షుడు గోలి తిరుపతిరావు జనసేన పార్టీలో చేరారు. స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మక్యాంటీన్ ఆవరణలో శుక్రవారం జనసేన పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ జడా బాలనాగేంద్రయాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. తిరుపతిరావు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ముఖ్య అనుచరుడు. ఆయన సతీమణి గోలి లక్ష్మి కార్పొరేటర్‌గా ఉన్నారు. గతంలో తిరుపతిరావు బీసీ సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మలగా రమేష్, గొర్రెపాటి శ్రీనివాసరావు, పార్సా కోటయ్య, కోటా సుధాకర్‌బాబు, కరేటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యలను పరిష్కరిస్తాం'



అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించటానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గుండాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూసదస్సులో తహసీల్దార్ కె.వాసుకు రైతులు 8 అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ విష్ణువర్ధన్, వీఆర్వో మారుతి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి : జేసీ



లింగంగుంటలో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ



కెల్లంపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి రవి

మద్దిపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండలం లింగంగుంటలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, తహసీల్దార్ సృజనకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఎంపీటీసీలు మన్నం కృష్ణకిషోర్, నల్లూరి శ్రీదుర్గ, సర్పంచ్ తోమాటి జనార్దన్, దమ్ము లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేర్నమిట్టలో..

సంతనూతలపాడు: పేర్నమిట్టలో 41వ డివిజన్ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 65 అర్జీలు వచ్చినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. తొలుత ఆయన ఎన్‌టీఆర్ కాలనీ, కుమ్మరిపాలెం, పాత అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించారు. కార్యక్రమంలో డీటీ మాబుసుభానీ, ఆర్‌ఐ రామ్‌తేజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బి.నిడమానూరులో..

నాగులుప్పలపాడు: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి బేబీరాణి పేర్కొన్నారు. బి.నిడమానూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో 13 అర్జీలు రాగా ఒకటి తక్షణమే పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పద్మ, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆలూరులో..

కొత్తపట్నం: రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ మధుసూదనరావు అన్నారు. శుక్రవారం ఆలూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజలు 28 అర్జీలను ఆయనకు సమర్పించారు. జాలిరెడ్డి అనే రైతు తన భూమికి దారి లేదంటూ ఇచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ వెంటనే స్పందించారు. భూమిని పరిశీలించారు. దారి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అర్జీలపై నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కెల్లంపల్లిలో..

మర్రిపూడి: గ్రామాలలో నెలకొన్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు బి.రవి అన్నారు. శుక్రవారం కెల్లంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చట్టబద్ధమైన సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ జ్వాలా నరసింహం మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో భూ సమస్యలపై రైతుల నుంచి అధికంగా వినతిపత్రాలు వస్తున్నాయని పేర్కొన్నారు. సరైన భూయాజమాన్య పత్రాలతో రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే సత్వరమే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈసదస్సులో 74 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిలో 40 అర్జీలు పోర్టింగ్‌కోసం వచ్చాయన్నారు. 10మంది మ్యూటేషన్‌కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. అనంతరం సచివాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి హద్దులను నిర్ణయించారు. సచివాలయ ప్రాంగణంలో అక్రమంగా నిర్వహించిన గృహాలను తొలగించాలని ఆక్రమణదారులను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు నాగరాజు, ప్రకాష్, ఆర్‌ఐ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రేగుల వీరనారాయణ, మందాటి బాలకోటయ్య, అవదారి సుబ్బారావు, ఆర్.ఇసాకు తదితరులు పాల్గొన్నారు.

వెన్నూరులో 19 అర్జీలు

కొండపి: వెన్నూరు గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో 19 మంది తమ అర్జీలను అందజేశారు. తహసీల్దార్ పి.మురళి రెవెన్యూ సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి అర్జీదారులకు తహసీల్దార్ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, రీసర్వే డీటీ కాశయ్య, మండల ఇన్‌చార్జి సర్వేయర్ రాజు, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో, గ్రామ సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరులో రెవెన్యూ సదస్సు తహసీల్దార్ ఆంజనేయులు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మణ్ నాయక్, ఆర్‌ఐ హనుమంతరావు, డీటీ శ్రీనాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైను పనులు తెచ్చిన పాట్లు..





బురదతో ఇబ్బందిపడుతున్న స్థానికులు

నగరంలోని భాగ్యనగర్ నాల్గవ లైనులో జరుగుతున్న తాగునీటి పైపులైను పనులు ప్రజలకు పాట్లు తెచ్చిపెట్టాయి గత నెల 25వ తేదీ నుంచి పైపులైను పనులు జరుగుతుండగా నేటికీ పూర్తి కాలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతంలో నీరు రోడ్లపైకి చేరి ప్రవహిస్తుండగా, ప్రజలు నడవడానికి కష్టంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి బురద కష్టాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు

- ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఒంగోలులో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్‌భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ నేతృత్వం వహించగా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీదు బాబు, జిల్లా సీనియర్ నాయకులు ఎండూరి రాజారావు, గద్దల రమేష్, ఐదుపోగుల అజయ్, శిఖామణి, రవికుమార్, పాలపర్తి పౌలు, చాట్ల బ్రహ్మయ్య, సుబ్బారావు, సందీప్, అభిషేక్ పలువురు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదానం చేస్తున్న నాయకులు

శ్రీవారి ప్రతిమ అందజేత



ప్రతిమను అందజేస్తున్న విజయారావు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీకి శుక్రవారం నూతనంగా ప్రారంభించిన అమ్ము ఫౌండేషన్ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి బి.విజయారావు రూ.15 వేల విలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని గత కొన్ని నెలలుగా నగరంలో నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. తమ ఫౌండేషన్ తొలి కార్యక్రమంలో భాగంగా స్వామి వారి ప్రతిమను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా బృందం, సభ్యులు నేరెళ్ల శ్రీనివాసరావు, ధనిశెట్టి రామునాయులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక శ్రీబాపూజీ గోసంరక్షణ శాల దగ్గర నుంచి శ్రీగిరి గిరిప్రదక్షిణ ప్రారంభం కాగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గోనుగుంటలో విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

చీమకుర్తి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): గోనుగుంట హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి వెంకటసుధాకర్, దాత అన్నం రామాంజనేయులు, నాగళ్ల సత్యం, ఆదినారాయణరెడ్డి, తిరువెంగళం, సర్పంచ్ సాదు మోహన్‌రావు, హెచ్‌ఎం బండి శ్రీనివాసరావు, టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

కొండపి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్, టీచర్స్ డే ప్రభుత్వం శనివారం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఒంగోలు డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్ శుక్రవారం మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీహెచ్‌ఎస్, కొండపిలోని జీహెచ్‌ఎస్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల పఠన, అవగాహన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. శనివారం స్కూళ్లలో జరిగే మెగా పేరెంట్స్ డే ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 49 స్కూళ్ల హెచ్‌ఎంలతో వెబెక్స్ ద్వారా ఏర్పాట్లపై మాట్లాడారు. ఆయన వెంట ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, కె.ఉప్పలపాడు హెచ్‌ఎం సుసన్నకుమార్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో కళ్ల అద్దాల అందజేత



కళ్ల అద్దాలను అందజేస్తున్న దాతలు

టంగుటూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రావూరి వినీల ఫౌండేషన్ చేస్తున్న సేవలు గొప్పవని జిల్లా అంధత్వ నివారణశాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నళిని అన్నారు. శుక్రవారం టంగుటూరులోని బీసీ బాలికల, బాలుర, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని విద్యార్థులకు రావూరి వినీల ఫౌండేషన్ వారు కళ్లజోళ్లు ఉచితంగా ఇవ్వడానికి ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధికార ప్రతినిధి రావూరి తిరుమల రాధాకృష్ణ, సభ్యులు గోపి, సాయికృష్ణ, ఆప్తాల్మిక్ డాక్టర్లు చంద్రశేఖర్, రాజ్‌కుమార్, ఎం. శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొగాకులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

టంగుటూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పొగాకులో వేరుకుళ్లు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సూచించిన మందులను పిచికారీ చేసుకోవాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి మండలంలోని ఆలకూరపాడు, అనంతవరం, టి.నాయుడుపాలెం, కారుమంచి, పొందూరు, మర్లపాడు, గ్రామాల్లో పొగాకుతోటలను, నర్సరీలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు.


జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు,
మా అన్నగారు, మా శ్రేయోభిలాషి,
ఎర్రగొండపాలెం నియోజకవర్గ
టీడీపీ ఇన్‌చార్జి
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు
Happy Birthday
శనగా నారాయణరెడ్డి
టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి,
మండల టీడీపీ మాజీ అధ్యక్షులు
పుల్లలచెరువు(మం)
శనగా శేషశయనారెడ్డి (వాసు)
శనగా వెంకటరెడ్డి
బోగోలు శ్రీనివాసరెడ్డి
మల్లెల శ్రీనివాసరెడ్డి
శనగా సుబ్బారెడ్డి
ఆవుల వెంకటక్రిష్ణారెడ్డి
శ్రీ సాయి సామిల్ & టింబర్ డిపో యాజమాన్యం
ఎర్రగొండపాలెం
SNR టింబర్స్ యాజమాన్యం
ఎర్రగొండపాలెం
శ్రీ సీతారామాంజనేయ జ్యూయలర్స్ యాజమాన్యం
ఎర్రగొండపాలెం
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం నియోజకవర్గ
టిడిపి ఇన్‌చార్జి


జన్మదిన శుభాకాంక్షలు
నిస్వార్థ ప్రజా సేవకులు, నియోజకవర్గ
అభివృద్ధే ధ్యేయంగా శ్రమించే నిత్య శ్రామికుడు,
మా కందరికీ అత్యంత ఆత్మీయులు,
ప్రజల మన్ననలు అందుకుంటూ,
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా
ముందుకు సాగుతున్న డైనమిక్ లీడర్
ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు
చిట్యాల వెంగళరెడ్డి
మాజీ MPTC
అమానిగుడిపాడు
పేరం వీరనాగిరెడ్డి
నీటి సంఘం మాజీ అధ్యక్షులు
వై.కొత్తపల్లి
కందుల నారాయణరెడ్డి
ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్
గురిజేపల్లి
పేరం రమణారెడ్డి
బొప్పాయి వ్యాపారి
వై.కొత్తపల్లి
కొల్లి వెంకటరెడ్డి
కాంట్రాక్టర్
పందివానిపల్లి
కైపు వెంకటరెడ్డి
బొప్పాయి వ్యాపారి
మురారిపల్లి
మేడగం సుబ్బారెడ్డి
యూనిట్ ఇన్‌చార్జి
మురారిపల్లి
బాష్యం రమణారెడ్డి
టీడీపీ నాయకులు
మురారిపల్లి
ఒంగోలు ఆదిరెడ్డి
టీడీపీ నాయకులు
ఎర్రగొండపాలెం
కందుల వెంకటేశ్వరరెడ్డి
గ్రామ పార్టీ అధ్యక్షులు
గురిజేపల్లి
సాధు లింగారెడ్డి
డీలర్
అమానిగుడిపాడు
గంజి రమణారెడ్డి
టీడీపీ నాయకులు
గంజివారిపల్లి
గంజి లింగారెడ్డి
గ్రామ పార్టీ అధ్యక్షులు
తమ్మడపల్లి
ఆముదం బ్రహ్మారెడ్డి
డీలర్
వై.కొత్తపల్లి
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం నియోజకవర్గ
టిడిపి ఇన్‌చార్జి





ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కంభం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కంభం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రవణనక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. దేవస్థాన ఆవరణలో కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమాచార్య సంకీర్తన చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వై.పాలెంలో సెమీక్రిస్మస్ వేడుకలు

● టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహణ

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజూనాథ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ ఎర్రగొండపాలెం నియోజవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఏరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు పాస్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఏరిక్షన్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. కావున నియోజవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

9 నుంచి ఉరుసు

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్‌వలీషా దర్గాలో ఈనెల 9 నుంచి 11 వరకు 173వ ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు పఠాన్ లతీఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 9న గంధం పూజ, 10న ఉరుసు, అన్నదానం, 11న గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పెద్ద దోర్నాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా నగర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులను టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ మంజూర్ భాష శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

17న విశ్రాంత పెన్షనర్లకు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న విశ్రాంత పెన్షనర్లకు సన్మానం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ మార్కాపురం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు డా.బాలసుబ్బారావు, జయరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 సంవత్సరాలు నిండిన 2009 జనవరి 1 నుంచి డిసెంబరు 31 మధ్య కాలంలో రిటైరయినవారు, సర్వీస్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు మార్కాపురం యూనిట్‌లో సభ్యులను నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన పెన్షనర్లు ఈ నెల 12 లోగా యూనిట్ ఆఫీస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మార్కాపురం యూనిట్ పెన్షనర్లు అందరూ హాజరుకావాలన్నారు.

ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రతిభ పరీక్షను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వొద్దుల వీరారెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిభ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 22న బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల కోసం ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై పోరాటాలే కాకుండా చదువుల్లో ప్రోత్సహించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహి స్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాందాస్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేశ్, శ్రీను పాల్గొన్నారు.

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సబ్ సబ్ కలెక్టర్‌కు ఆహ్వానం

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం సాయంత్రం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వెళ్లి సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓవీ వీరారెడ్డి, విద్యార్థులు ఉన్నారు.







ప్రయాణికుల మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి

- కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల


కొత్తబస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు ఆర్టీసీ డిపోకు మంజూరైన ఆరు కొత్త బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన గిద్దలూరుకు నూతన బస్సులు రావడం సంతోషదాయకమన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని కొత్త బస్సుల అవసరం గిద్దలూరు డిపోకు ఉందదన్నారు. వాటికోసం కృషి చేస్తానన్నారు. రోడ్డుసౌకర్యం ఉన్న మారుమూల ప్రాంతాలకు సైతం బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బస్సు డిపో ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు, మురికి కుంటను పరిశీలించి తక్షణమే తొలగించాలని డిపో మేనేజర్ చంద్రశేఖర్‌కు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ గురువయ్య, ట్రాఫిక్ సీఐ మౌనిక, కొమరోలు మండలపార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు డి.బాలీశ్వరయ్య, ఒ.వెంకటయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం

- అందజేసిన టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు


ప్రభుత్వసాయం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామంలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన చెక్కులను అందజేసింది. బాధిత కుటుంబ సభ్యులకు టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పరామర్శించి చెక్కులను అందజేశారు. పెద్దారవీడు మండల కేంద్రానికి చెందిన ఒంటేరు నాగరాజు, సంకుల రంగారావులు కొనకనమిట్ల మండలం సిద్ధవరంలో విద్యుత్ తీగల పనులు చేస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూటమి ప్రభుత్వం వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణ సాయం అందేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ నాగేశ్వరరావు టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జెడ్డా రవి, దొడ్డా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండతోనే పశ్చిమ ప్రాంత అభివృద్ధి

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయితేనే అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. శుక్రవారం ఎర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.2 వేల కోట్లు నిధులు అవసరమన్నారు. అయితే ప్రభుత్వం కేటాయించిన సుమారు రూ.394 కోట్లు పాత బకాయిలకే సరిపోతాయన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన నిదులు కేటాయించి పూర్తి చేసిప్రజల నీటి కష్టాలను తీర్చాలని ప్రభుత్వా న్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, సిపిఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ.కృష్ణగౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, రైతుసంఘం నియోజకవర్గ నాయకులు మన్నె సాంబశివరావు, మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓటమిని అధిగమించి ముందడుగు

- వైపాలెంలో టీడీపీ నేతల సరికొత్త పంథా
- కలిసి వస్తున్న ఎరిక్షన్‌బాబు విస్తృత పరిచయాలు, నాయకత్వ పటిమ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

గత ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమికి, టీడీపీకి భారీ విజయం దక్కింది. కానీ ఎరగొండపాలెంలో మాత్రం పాతకథే పునరావృతం అయింది. అయితే ఈ పర్యాయం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు ఓటమి భారాన్ని అధిగమించి ముందడుగు వేస్తుండటం విశేషం.

నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుకు పార్టీలో, ప్రభుత్వ పెద్దలతో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఆయనకు ఉన్న నాయకత్వ పటిమ అందుకు దోహదపడుతున్నాయి. ఫలితంగా నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు గతంలో ఎన్నడూలేని విధంగా ధీటుగా ముందడుగు వేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గాలు ఏ మాత్రం తీసిపోకుండా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుండడం ప్రజానీకాన్ని ఆకర్షితులను చేస్తోంది.

రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావంకు ముందు ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు, దివంగత పూలసుబ్బయ్యతో కమ్యూనిస్టులకు పట్టు ఉండేది. 1978కి ఆ నియోజకవర్గం రద్దయ్యి మార్కాపురంలో కలిసింది. ఆ ప్రాంతంలోనూ కాంగ్రెస్‌కే ఆధిక్యత కనిపిస్తూ వచ్చింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా తిరిగి ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడింది. ఆ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు అనంతరం జరిగిన 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఇక్కడ గెలుపొందారు. గత ఎన్నికల్లో టీడీపీ ముందస్తు వ్యూహంతో టీడీపీకి అంకితమై పనిచేస్తున్న ఎరిక్షన్‌బాబును రంగంలోకి దింపింది. అయితే గెలుపు వాకిట్లో టీడీపీకి మరోసారి పరాజయం ఎదురైంది. కేవలం 5200 ఓట్ల తేడాతో ఎరిక్షన్‌బాబు ఓటమి చవిచూశాడు. దీంతో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి గతంలో వలే దిగజారిపోతుందని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేశారు. అయితే గ్రామ, మండల స్థాయిలో పలు పదవులతో పాటు టీడీపీలో అనేక పదవులు నిర్వహించిన ఎరిక్షన్‌బాబు ఎన్నికల్లో ఓటమి చెందినా పార్టీ శ్రేణులు నిరుత్సాహం పడకుండా ధీటుగా ముందుకు నడపగలుగుతున్నారు. అయితే పార్టీలో కొందరు నాయకుల్లో అంతో ఇంతో అసంతృప్తి ఉన్నా పాత, కొత్త తరం నాయకులతో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసి వారిని ఐక్యంగా ముందుకు నడపటంలో సఫలీకృతులవుతున్నారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వంలో కూడా టీడీపీ క్యాడర్‌కు ఏ కష్టం వచ్చినా ఎదురొడ్డి నిలచిన ఎరిక్షన్‌బాబు ఎన్నికల అనంతరం వారి సంక్షేమ అంశాల విషయంలో వ్యూహాత్మకంగా ముందగుడు వేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ పార్టీలోని రాష్ట్ర నాయకులందరితో విస్తృత పరిచయాలు ఉండటం అందుకు దోహదపడింది. నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే చురుగ్గా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించే ప్రయత్నాలు చేసినా తిప్పికొట్టగలుగుతున్నారు. గ్రామ, మండల స్థాయిలో వివిధ పదవుల్లో ఉన్న వైసీపీ శ్రేణుల నుంచి మద్దతు పొందడం లేక వారిని ధీటుగా ఎదుర్కొని కార్యక్రమాలు కొనసాగించడంలో సఫలీకృతులవుతున్నారు. అధికారికంగా ఎలాంటి పదవులు లేకున్నా జిల్లా, రాష్ట్ర నాయకులు, పాలకుల మద్దతుతో, యంత్రాంగం సహకారంతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా పాలనా వ్యవహారాల్లో పార్టీ శ్రేణులను ఎరిక్షన్‌బాబు భాగస్వాములను చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో అధికార పార్టీకి అనుకూలంగా చేపట్టే నియామకాల్లో పార్టీ శ్రేణులను నియమించు కోవటంలో 70శాతం వరకు సఫలీకృతులయ్యారు. మండల పరిషత్, గ్రామ పంచాయితీల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఇబ్బందులు రాకుండా చూసుకోగలుగుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు ధీటుగా అభివృద్ధి ఫలాలను నియోజకవర్గానికి రాబట్టే విషయంలోనూ ఆయన ముందు వరుసలో ఉన్నారు. వెలిగొండ ప్రాజెక్టు, తీగ లేరు అభివృద్ధి వంటి పెండింగ్ పనుల విషయంలో ప్రభుత్వ పెద్దలను సమన్వయ పరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనుల్లో ఏమాత్రం వెనుకాడకుండా నియోజకవర్గంలో పనులు చేపడు తుండడం విశేషం. విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ సహకారంతో నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గిరిజన ప్రజల నివాసిత ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపారు. విద్యుత్ సరఫరా లేని గిరిజన గూడెంలకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు జరుగుతున్నాయి. జిల్లా మంత్రి స్వామి సహకారంతో సంక్షేమ పథకాలు అందక ఇబ్బంది పడుతున్న టీడీపీ సానుభూతిపరులకు వాటిని అందించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కలెక్టర్ ఇతర ఆయా శాఖల ముఖ్య అధికారులతో సంబంధాలు కొనసాగిస్తూ ఆయా శాఖల ద్వారా నియోజకవర్గంలో అమలు జరగాల్సిన సంక్షేమ, అభివృద్ధి పనులకు లోటురాకుండా చేస్తుండడంతో ఇప్పటికే ఎరిక్షన్‌బాబు సఫలీ కృతులయ్యారనే చెప్పుకోవచ్చు. పార్టీ సభ్యత్వ నమోదు విషయంలోనూ లక్ష్యాలకు అనుగుణంగా నియోజక వర్గంలో సభ్యత్వం నమోదు కూడా చేస్తుండడం విశేషం. దీంతో అటు పార్టీ నాయకత్వంలోనూ, పాలనా యంత్రాంగం లోనూ ఎరిక్షన్‌బాబుకు మరింత గుర్తింపు లభించింది. అయితే నియోజకవర్గంలో ఉన్న మరో సీనియర్ నాయకుడు డాక్టర్ రవీంద్రతో సన్నిహిత సంబంధాలు సన్నగిల్లాయి. ఇటీవల డాక్టర్ రవీంద్ర ఇంట్లో ఒక శుభకార్యానికి పార్టీ రహితంగా అందరినీ ఆహ్వానించారు. అయితే ఎరిక్షన్‌బాబును మాత్రం ఆహ్వానించలేదు. ఈ సమస్యను టీడీపీ అధిష్ఠానం గుర్తించి ప్రత్యేక దృష్టితో వాస్తవాలను పరిశీలిస్తుంది. ఓటమి భారం నుంచి ధీటుగా ముందడుగు వేస్తున్న టీడీపీకి గాడిలోపడిన అభివృద్ధి పనుల నిర్వాహణకు ఆటంకం లేకుండా అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.


ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నేతలు (ఫైల్)

యువతి దారుణ హత్య

కత్తితో పొడిచి చంపిన ప్రియుడు

గిద్దలూరుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతి దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని రజకవీధిలో చోటు చేసుకొంది. వివాహేతర సంబంధం నేపథ్యం ప్రియుడే ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాచర్లకు చెందిన పి.సుహాసిని (24)అనే యువతికి రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అనంతరం ఆమె గిద్దలూరు వచ్చి ఓ రెడీమేడ్ బట్టల దుకాణంలో పని చేస్తోంది. ఈ క్రమంలోనే రాచర్లకు చెందిన నానీ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం గిద్దలూరుకు వచ్చాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె చాతిలో పడిచాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో నానీ పరారయ్యాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుహాసిని పరిస్థితి విషమంగా ఉండడంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఘటనపై మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు. కాగా నిందితుడు పరారీలో ఉన్నాడు.


మృతిచెందిన సుహాసిని, నిందితుడు నాని

అక్రమ నిర్మాణాలను నివారించండి

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :గిద్దలూరు ప్రాంతంలో అక్రమ కట్టడాలు ఎక్కువగా నిర్మిస్తున్నారని వాటిని నివారించాలని బీజేపీ నాయకులు కోరారు. విజయవాడలోని రాష్ట్ర పట్టణ ప్రణాళిక డైరెక్టర్ వి.రంగరాజ్‌ను ఆ పార్టీ నాయకులు శుక్రవారం కలిశారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. పార్కింగ్ ప్లేస్ లేకుండా, రోడ్డుపైకి భవనాల పైకప్పులు రాకుండా చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. ప్లాన్ అప్రూవల్ తీసుకున్నప్పటికీ అంతకు మించిన కొలతలతో భవనాలు నిరిస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారు బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు పక్కాగృహాలు నిర్మించాలి

కంభం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నేదురుమల్లి జయరాజ్ తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షాటన చేస్తూ, హోటళ్లలో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న పేద ముస్లిం పకీర్ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కంభం పంచాయతీ, సచివాలయంలో రెవెన్యూ సదస్సులో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిశీలించి నిలువ నీడలేని వారికి ఇళ్లు ఇవ్వాలని కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించ వద్దు

- దుకాణదారులకు ఎస్సై సూచన

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారి వెంబడి ఉన్న వీధి విక్రేతలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వారి వ్యాపారాలు నిర్వహించుకోవాలని, వై.పాలెం సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం బస్టాండ్ ఎదురుగా మార్కెట్ దారిలోని దుకాణాలు ఎక్కువ సంఖ్యలో రోడ్లపై ఏర్పాటు చేయడంతో సమస్య వస్తోందన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చిరువ్యాపారులు సహకరించాలన్నారు.



యువకుడి ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫ్యానుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని చెంచుపాముల కాలనీ లో చోటుచేసుకొంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన ఓరుగంటి రాజేష్ మద్యానికి బానిసై ఇంట్లో ఏవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఊరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. గతంలో రాజేష్‌పై మర్డర్ కేసు ఉండగా బెయిల్‌పై వచ్చాడు. మద్యానికి బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. తల్లితో ఉంటుండగా తల్లి గురువారం పనులు నిమిత్తం మార్కాపురం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయ్యంలో ఆత్మాహత్యకు పాల్పడినట్లు తెలిపారు. రాజేష్ అన్న మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పి చౌడయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి

మార్కాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాయవరం వద్ద చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాయవరం గ్రామానికి చెందిన రాయవరం గ్రామంలోని తన స్నేహితుడి వద్దనుండి బైకు తీసుకుని ఓవర్ బ్రిడ్జి పై వెళుతుండగా అదుపుతప్పడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు స్వగ్రామం పెద్దారవీడు మండలం చట్టమిట్ల గ్రామానికి చెందిన వారని తెలిపారు. ఓవర్ బ్రిడ్జి పై బైకు అదుపుతప్పి యువకుడు మట్రా వెంకట్రావు (21) మృతి చెందిన సంఘటన మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వెంకట్రావు

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కాపాడాలని మండలంలోని వెల్లుపల్లె ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్ రెవెన్యూ సదస్సులో అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆయన శుక్రవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని అంబవరం రెవెన్యూ మజరా గ్రామమైన వెల్లుపల్లె గ్రామపరిధిలోని సర్వే నెంబరు 988, 989, 1014, 1015, 1024, 1025/1 ప్రభుత్వ భూములను, కుంట భూములను ఏలూరు జిల్లాకు చెందిన కొత్త సాంబశివరావు అనే వ్యక్తి ఆక్రమించుకుని ఫ్రీహోల్డ్‌తో పాటు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడన్నారు. సంబంధిత అధికారులు ఆ సర్వేనంబరులోని భూమిని పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి కాపాడాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నాడు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగడాల రంగస్వామి డిమాండ్ చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 10వేల హెక్టార్లలో కంది, వరి, మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం: ముత్తుముల

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. రాచర్ల మండలం ఆకవీడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వైసీపీ పాలనలో భూవివాదాలు, సర్వే సమస్యలు పెరిగి వాటి యజమానులు ఇబ్బందులు పడ్డారన్నారు. వాటి పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం లిఖితపూర్వకంగా అర్జీలు ఇస్తే అధికారులు వాటిని పరిశీలించి న్యాయం చేస్తారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



భూకబ్జాదారుల భరతం పట్టేందుకే రెవెన్యూ సదస్సులు

- వైసీపీ భూదోపిడీదారులకు తప్పక అరదండాలు
- రెవెన్యూ గ్రామ సభల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భూములు, స్థలాలను అడ్డగోలుగా కొల్లగొట్టిన వారి భరతం పట్టేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల భూములు, స్థలాలకు రక్షణలేకుండా పోయిందన్నారు. ఇష్టారీతిన ఎవరిస్థాయిలో వారు ఆక్రమణలకు తెగబడ్డారన్నారు. అలాంటి వారి అంతు తేల్చేందుకే కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సదస్సును నిర్వహిస్తోందన్నారు. బాధిత ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేస్తే వాటిని నిగ్గుతేల్చి దోషులతో అరదండాలు వేయిస్తామన్నారు. మార్కాపురం నియోకవర్గ పరిధిలో వందలాది ఎకరాల భూములు ఆక్రమణదారుల పాలయ్యాయని అన్నారు. ప్రతి సెంటు భూమిని బాధితులకు ఇచ్చే వరకు తాను పోరాడతానన్నారు. మరో ముఖ్య అతిథి సబ్ కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో ఇబ్బందులుపడే ప్రజలకు సదస్సులు వరంలాంటివన్నారు. వారి సమస్యలను అధికారులకు తెలియజేస్తే 45 రోజులుగా వారికి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తహసిల్దార్ చిరంజీవి, దేవాదాయశాఖ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కొనకమిట్ల మండలం వెలిగండ్లలోనూ, తర్లుపాడు మండలం బుడ్డపల్లి, కేతగుడిపిలోనూ జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

చెన్నయ్య ఆలయ భూములను కొట్టేసారని ఫిర్యాదు

మార్కాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ భర్త శ్రీనివాసులు కుటుంబ సభ్యులు లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన రూ.కోట్ల విలువైన భూములను కొట్టేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దనాగులవరం గ్రామసభలో కొందరు ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. అంతేకాక గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి మాన్యం భూములను అనుభవిస్తున్నా, అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కమిటీకి అప్పజెప్పి ఆలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్థులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి రెండు అంశాలపై రెవెన్యూ, దేవాదాయశాఖాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దనాగులవరంలో జరిగిన గ్రామసభలో రెవెన్యూ సమస్యలపై మొత్తం 67 అర్జీలను గ్రామస్థులు అందజేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కరించే దిశగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మురారిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ రెవెన్యూ సదస్సు భూ సమస్యలపై 35 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు ఏ బాలకిషోర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సత్యనారాయణ, వీఆర్వో షేక్ ఖాదర్ వలి, టీడీపీ మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు



భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


కనిగిరి: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

హనుమంతునిపాడు(కనిగిరి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమంతునిపాడు మండలం వాలిచర్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు చెందిన వేలాది ఎకరాల అసైన్డ్ భూములను భయపెట్టి, బెదిరించి వారి పేర్లతో మార్చుకున్నారన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను, వాగు, వంక, పోరంబోకు భూములను మొత్తం మింగేసిన వైసీపీ నేతలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. పేదలకు చెందాల్సిన భూములను తిరిగి ఇప్పిస్తామన్నారు. అక్రమంగా ప్రభుత్వ రికార్డులను మార్చి వెంచర్లు వేశారన్నారు. పేదలకు చెందిన భూములను కాజేసి వారికే ప్లాట్లు కట్టబెట్టి కోట్లకు పడగలెత్తారన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు తావుండదన్నారు. భూములను కాజేసిన ప్రతిఒక్కరి నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), చీకటి వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, పెంచికల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమ స్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సుల ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమ ణారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని రావిగుంటపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల చెంతనే రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈసందర్భంగా మ్యుటేషన్, భూ సర్వేకు సంబంధించి 25 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎం.పానకాలరావు, ఎంఆర్ఐ బి.మల్లికార్జున, మండల సర్వేయర్ స్నేహలత, వీఆర్వో గ్రాబ్రియేల్, విలేజ్ సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వెలిగండ్లలో 26 అర్జీలు

వెలిగండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్ర భుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రామగోపాలపురంలో జరిగిన సదస్సులో 26 అర్జీలు వచ్చాయ ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బా రమణా రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో 15 అర్జీలు

పీసీపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష పేర్కొన్నారు. శుక్రవారం చినవరిమడుగులో జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా 15 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ, దేవదాయశాఖ ఈవో కొండారెడ్డి, వీఆర్వో పిచ్చిరెడ్డి, సర్వేయర్ వెంకటొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దర్శి డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలం లోని బండివెలిగండ్ల, కట్టసింగన్నపాలెం గ్రామాల్లో శుక్ర వారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా తహసీల్దా ర్ మాట్లాడుతూ భూములు, స్థలాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా 25 అర్జీలు దాఖలయ్యాయి. భూముల హక్కులు బదలాయింపు చేయాలని, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని అధికశాతం దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


దర్శి: బండివెలిగండ్లలో అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

తాళ్లూరులో..

తాళ్లూరు, డిశంబరు 6(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ మాధురి అన్నారు. శుక్రవారం తాళ్లూరు సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. తాళ్లూరు గ్రామంలోని సర్వే నంబరు 268లోని గల 13.30 ఎకరాల భూమిని గతప్రభుత్వం దేవుని భూమిగా రికార్డుల్లో ఎక్కించటం వల్ల గ్రామంలోని 400 గృహాలకు చెందిన గృహయజమానులు క్రయ, విక్రయాలు జరపాలన్నా, బ్యాంక్‌ల్లో రుణాలు కోసం తనఖా పెట్టాలన్నా ఇబ్బందులు పడుతున్నారని వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ నేత చందోలు రామారావు అధికారులకు విన్నవించారు. ఈ సదస్సులో 17 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, డీటీ రాజు, ఎంఈవో జి.సుబ్బయ్య, సర్పంచ్ చార్లెస్ సర్జన్, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, ఆర్ఐ అనూష, వీఆర్వో నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఐ.రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో 34 అర్జీలు

దొనకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 34 అర్జీలు అందినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ప్రత్యేకాధికారి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలను పరి ష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజ లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ముండ్లమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా మత్స్య శాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేంపాడులో జరిగిన సదస్సుకు సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రైతులు భూపరమైన సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లయితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా ఎస్సీ కాలనీని ఆయన పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. కాగా, సదస్సులో 40 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, మండల సర్వేయర్ సీహెచ్ కోటంరాజు, తదితరులు పాల్గొన్నారు.


ముండ్లమూరు వేంపాడులో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు

కురిచేడులో 36 అర్జీలు

కురిచేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారం మండలంలోని పడమరకాశీపురం, కల్లూరు గ్రామాలలో తహసీల్దార్ రజనీకుమారి అధ్యక్షతన జరిగాయి. ఈసందర్భంగా పడమరకాశీపురం గ్రామంలో 18 అర్జీలు, కల్లూరు గ్రామంలో 18 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.శ్రీధర్‌రావు, ఆర్ఐ నాగరాజు, సర్పంచ్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు

పామూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు గ్రామ పంచాయతి పరిధిలోని జంగాలపల్లె గ్రామం నుంచి కోడిగుడ్లపాడు వరకు ఉన్న తారురోడ్డు ప్యాచ్ పనులకు రూ. 11 లక్షల నిధులు మంజూరు చేయడంపట్ల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న సబ్‌ప్లాన్ నిధుల కింద రూ.48 లక్షలు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, దారపనేని రాజేంద్రప్రసాద్, నరసింహానాయుడు, కొలూరి ఖాజారహంతుల్లా పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

దొనకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. దొనకొండ ఏబీఎం చర్చి పాస్టర్ రెవరండ్ ప్రభుదాస్ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని విద్యార్థులకు క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలిపి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొవిలంపాడులో టీడీపీ సభ్యత్వాల నమోదు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని కొవిలంపాడు గ్రామ పంచాయతీలో బూత్ నెంబర్ 86,87,91లో శుక్రవారం నాటికి 710 టీడీపీ సభ్యత్వాలు పూర్తి చేసినట్లు తెలుగుయువత ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా తెలిపారు. కొవిలంపాడు, మిట్టపాలెం, శీలంవారిపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వాల నమోదు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించినట్లు తెలిపారు.

పెద్దన్నకు ఉత్తమ హోంగార్డు అవార్డు

కనిగిరి , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించిన హోంగార్డు కొంపల్లి వెంకటపెద్దన్న ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికయ్యారు. హోంగార్డుల అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని పెరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకాన్ని అందుకున్నారు. అవార్డు అందుకున్న పెద్దన్నకు తోటి పోలీసు సిబ్బందితో పాటు సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం, మాధవరావులు అభినందించారు.

తల్లిదండ్రుల సమావేశాలకు సర్వం సిద్ధం

దొనకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై కూటమి ప్రభుత్వం శనివారం తలపెట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు ప్రభుత్వ పాఠశాలలు సర్వం సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఉపాధ్యాయులు ఇళ్లవద్దకు వెళ్లి తల్లిదండ్రులు తప్పనిసరిగా సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానాలు అందజేశారు. సమావేశం నిర్వాహణ అనంతరం నిర్వహించే భోజన ఏర్పాట్లకు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి మంజూరై న నగదును మండల విద్యాశాఖ అన్నీ పాఠశాలలకు అందజేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎంఈవో

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరిగే తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. సమావేశాల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

కనిగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే బలహీనవర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి నాగరాజు, దళిత నాయకులు కుంచెం జక్రయ్య, బాలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే, ఎంఈఎఫ్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీం నాయకుడు సూరెరాజు, ఎంఈఎఫ్ నాయకులు జి.సంజీవి, అంటోని, రాజారావు, బూదాల కిరణ్, రమేష్, మేషక్ పాల్గొన్నారు. ఎన్టీయార్ అభిమాన సంఘం నాయకులు ఆధ్వర్యంలో వైఎస్సార్ రోడ్డులోని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్టీయార్ అభిమాన సంఘం నాయకులు యస్దాని బాషా (పులి), బడేబాయి, నన్నేబాయి, తాతపూడి ఐజక్, ముంగమూరి శ్రీను, ఉంగరాల బాషా, పెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కనిగిరి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

ముండ్లమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని సీపీఎం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మారెళ్ళ గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత పని చేయాలన్నారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

ముండ్లమూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ఆర్. జనార్దన్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దొనకొండలో.. దొనకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ నాయకులు కడియాల రమేష్, నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు నాలుగు రోడ్ల కూడలి, ఒబ్బాపురంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, పోతిపోగు చెన్నయ్య, మోడి పెద్దఆంజనేయులు, షేక్ తోహిద్, మస్నెం గాలయ్య, యగ్గోని యల్లారెడ్డి, బత్తుల బ్రహ్మయ్య, బండ్లా వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే, నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, తదితరులు నివాళులర్పించారు.

దర్శిలో.. దర్శి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం దర్శిలో నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ జి.సుధారాణి, ప్రజా సంఘాల నాయకుడు రాచపూడి మోషే తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంధం ఇర్మియా, గోళ్లపాటి అచ్చయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, సర్పంచ్‌లు చిమటా సుబ్బారావు, షేక్ కాలేషావలి, మందా శ్యాంసన్, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి , కార్యాలయ అడ్మిస్ట్రేటివ్ అధికారి ఎస్.సత్యం, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఆదామ్, యోహన్, అనపర్తి సుబ్బారావు, అనపర్తి సత్యవర్ధన్‌రావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో ముందుకుసాగాలి

పామూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ బాటలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, షేక్ గౌస్‌బాషా, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన నాయకలు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


దొనకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కడియాల రమేష్ తదితరులు

కురిచేడులో.. కురిచేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని సచివాలయంలో ఎమ్మార్పీఎస్ నేత కంభంపాటి జోసెఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నుసుం వెంకంటనాగిరెడ్డి, టీడీపీ నాయకుడు కాట్రాజు నాగరాజు, సర్పంచ్ కేసనపల్లి కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బి, యోగేశ్వర రావు, అనిల్, సామ్యేలు, కె.వెంకటయ్య, అచ్చయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

» నీట మునిగిన వేలాది ఎకరాల మినుము

» దెబ్బతిన్న వేరుశనగ, పొగాకు, కంది పైర్లు

కనిగిరి/పీసీపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. గురువారం కురిసిన వర్షం రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. కనిగిరి, హనుమంతునిపాడు, పీసీపల్లి మండలాల్లో దాదాపు 13,500 ఎకరాల్లో మినుము వేశారు. ఈ వర్షంతో పంటంతా దెబ్బతింది. అలాగే, వేరుశనగ, పప్పుశనగ, పెసర, వేరుశనగ, పప్పుశనగ, పంటలు నీటి పాలై చేతికి దక్కే పరిస్థితే లేదు. పొగాకు తోటలు దెబ్బతిన్నాయి. కంది పూత అంతా రాలిపోయింది.

ఈ ఏడాది అపరాలకు మంచి గిరాకీ ఉండడంతో పీసీపల్లి మండలంలోని రైతులు కంది, మినుమును అత్యధికంగా సాగుచేశారు. మరికొద్ది రోజుల్లో మినుము కోతలు మెదలుపెట్టి పంట ఇంటికొస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు ఈ వర్షం దెబ్బతీసింది. వర్షపునీరు పైరును ముంచెత్తింది. తురకపల్లి, శంకరాపురం, మెట్లవారిపల్లి గ్రామాల్లోని పొలాల్లో వర్షపునీరు పారడంతో ఆ తాకిడికి చేలల్లో ఉన్న మట్టి పైరును కప్పేసింది. మరి కొద్దిరోజుల్లో కోతలు కోయవచ్చు అనుకున్న మినుము పంటలోని దోరకాయలు బూజుపట్టగా ఎండినకాయలు పగిలి గింజలు మొలకెత్తాయి. ఇప్పటికే ఎకరాకు రూ.20వేల వరకు రైతులు ఖర్చుపెట్టారు. ఈ వర్షం కోలుకోలేని దెబ్బ తీసిందని మినుము రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంటనష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


పీసీపల్లి :గుంటుపల్లిలో వర్షానికి దెబ్బతిన్న మినుము


కనిగిరి: తక్కెళ్ళపాడులో పూతరాలిపోయిన కంది

ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

- మూలె బుజ్జిరెడ్డి, రైతు, శంకరాపురం

నాకున్న పొలంతో పాటు మరికొంత పొలం కౌలుకి తీసుకుని 30ఎకరాలకు పైగా మినుము సాగుచేశాను. గత ఏడాది కంటే ఈ సంవత్సరం పంట బాగా పండింది. మరికొద్ది రోజుల్లో మినుమును కొయ్యాలనుకున్న తరుణంలో భారీ వర్షం ముంచెత్తింది. దీంతో చెట్లపై ఉన్న కాయలు పగిలి గింజలు మొలకెత్తాయి. ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టా. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

'పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం'

కనిగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో పేదలకు ప్లాట్లు వేసి కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా చేసిందని ఆరోపించారు. కనీసం ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండానే చెరువులను తలపించే చోట ఇళ్ళను నిర్మించారన్నారు. దీంతో కాలనీలన్నీ నిరుపయోగంగా మారాయన్నారు.

ఈనెల 11న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కనిగిరి వస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చెప్పారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నాగులచెరువులోకి నీరు చేరటం ద్వారా భూగర్భజలాలు పెంపొంది వేసవికాలంలో నీటి ఎద్దడి సమస్య తగ్గనుందన్నారు. ఓవీ రోడ్డు నిర్మాణం ఆరు నెలల్లో ప్రారంభించటం జరుగుతుందన్నారు. ట్రిపుల్‌ఐటీ నిర్మాణంతో పాటు అతిత్వరలో రిలయన్స్ గ్యాస్ పరిశ్రమను ప్రారంభించనున్నట్లు చెప్పారు. డయాలసిస్ యూనిట్‌ను 2 షిఫ్ట్‌లలో చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

నవోదయ స్కూల్ ఏర్పాటుకు ఎంపీ మాగుంట కృషి చేయనున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. మూడు నెలల్లో బైపాస్ రోడ్డు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో కనిగిరి పదో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిరంజీవి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

దర్శి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళా దొంగలను దర్శి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ వై.రామారావు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చోరీ కేసు వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, మధిర మండలానికి చెందిన నల్లబోతుల వెంకటమ్మ, ఆమె కుమార్తె నాగమణి కొంతకాలంగా చోరీలు చేస్తూ విలువైన వస్తులను అపహరించేవారు. హైదరాబాద్, రాయచోటి, తిరుపతి, మార్కాపురం, కందుకూరు, భట్టిప్రోలు, తాళ్లూరు తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. తొలుత వస్త్ర దుకాణాలకు వెళ్లి చీరలను దొంగిలించేవారు. దాంతో తక్కువ డబ్బులు వస్తుండడంతో బంగారు ఆభరణాలను దొంగించేందుకు పథకం రూపొందించారు. రద్దీగా ఉండే గోల్డ్ షాపులకు వెళ్లి ఆభరణాలు కొనుగోలు చేస్తున్నట్లు మాయ చేసి అపహరించేవారు.

ఇదేక్రమంలో తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన విఘ్నేశ్వర గోల్డ్ షాప్‌లోకి ఈనెల 2న వెళ్లారు. చెవికమ్మలు చూపించగా నచ్చలేదు వేరేవి చూపించాలని అడిగారు. దీంతో వస్తువులు తెచ్చేలోపు వాటి స్థానంలో నకిలీ కమ్మలను ఆ బాక్సులో ఉంచారు. అలా ఆరు జతలను చోరీ చేసి నకిలీవి అక్కడుంచి కారులో పరారయ్యారు. కొంత సేపటికి దుకాణ యజమానికి అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ వస్తువులుగా గుర్తించి తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దర్శి సీఐ రామారావు ఆధ్వర్యంలో ముండ్లమూరు ఎస్ఐ నాగరాజు, తాళ్లూరు ఏఎస్ఐ మోహన్‌రావు శుక్రవారం గాలిస్తుండగా వెల్లంపల్లి హైవే వద్ద నిందితులను అరెస్టు చేశారు. 24 గ్రాముల బరువుగల ఆరు జతల కమ్మలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చారు. నిందితులకు రిమాండ్ విధించినట్లు సీఐ రామారావు తెలిపారు.

అసంబద్ధ నిర్ణయాలను విద్యాశాఖ రద్దు చేయాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, మీనుగ శ్రీనివాసులు తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంఈవో కె.రఘురామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాలకు నిరసనగా ఈనెల 11న విద్యాశాఖ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు యలమందారెడ్డి, అట్లూరి రామారావు, పి.ఖాశీం, కె.రామారావు, ప్రసాదరావు, ఇట్లా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): విద్యాశాఖ అధికారులు అనుసరిస్తున్న అసంబద్ధ నిర్ణయాలు తగదని యూటీఎఫ్ సీఎస్‌పురం మండల అధ్యక్ష కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా, సిల్లా కార్యదర్శి అరియారం సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలో ఉపాధ్యాయుడు అజాజ్ అహ్మద్ విద్యార్థుల దాడిలో మరణించడం అమానుషమన్నారు.

కేజీబీవీ వద్ద పారిశుధ్య పనులు

తాళ్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయం చుట్టూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. విద్యాలయం చుట్టూ చిల్లచెట్లు ఏపుగా పెరిగి విద్యాలయంలోని మురుగు నీరు కిందికి వెళ్లక అపరిశుభ్రంగా ఉంది. ఈసమస్యను గుర్తించిన ఎంపీడీవో కె.సుందరారామయ్య పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో సర్పంచ్ చార్లెస్‌సర్జన్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో పారిశుధ్యపనులు నిర్వహించారు. కేజీబీవీ చుట్టూఉన్న చిల్లచెట్లను తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డులోని చప్టా వరకు ఎక్స్‌కవేటర్‌తో పెద్ద కాలువను తీయించారు. దీంతో సమస్య తీరింది.


కేజీబీవీ ప్రహరీగోడ వద్ద తొలగిస్తున్న మురుగు





సమావేశం కోసం సర్వాంగ సుందరంగా ఏర్పాటుచేసిన మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం

బారులు తీరిన.. భూ బాధితులు

- జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభం
- భూ సమస్యలకు పరిష్కారం చూపేలా గ్రామసభలు
- పేటేరులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించిన రెవెన్యూ మంత్రి అనగాని
- గవినివారిపాలెంలో సదస్సు ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి
- కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్న మంత్రి సత్యప్రసాద్



అర్జీలు తీసుకునే రెవెన్యూసిబ్బందికి సూచనలు చేస్తున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



చీరాల: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, రేపల్లె, చీరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు జిల్లా అంతటా శుక్రవారం ప్రారంభమయ్యాయి. భూముల పరంగా ఉన్న చిక్కులను తొలగించడంతో పాటు ఐదేళ్లలో వైసీపీ చేసిన అక్రమాలను నిగ్గు తేల్చి బాధితులకు అండగా ఉండేందుకు రెవెన్యూ సదస్సులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఆయా గ్రామాల్లో భూ యజమానులు, రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా 25 మండలాల పరిధిలోని 25 గ్రామాల్లో శుక్రవారం అధికారులు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. సదస్సుల్లో భాగంగా గ్రామానికి సంబంధించిన భూ రికార్డులను, గ్రామ చిత్రపటాన్ని ప్రదర్శించారు. ప్రజలు వాటిని తనిఖీ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ప్రజలు ఆయా రికార్డులను తనిఖీ చేసుకొని ఏమైనా సవరణలు ఉంటే అర్జీ దాఖలు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. రెవెన్యూతో పాటు రిజిస్ట్రేషన్, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, పంచాయతీ, అటవీ తదితర శాఖల అధికారులు కూడా సదస్సుల్లో పాల్గొనేలా టీంలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకటమురళి చీరాల మండలం గవినివారిపాలెంలో రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె మండలం పేటేరులో జరిగిన సదస్సుకు హాజరై స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల కారణంగా రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా భూసమస్యలు పెరిగిపోయాయని, బాధితుల నుంచి 67వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ క్రమంలోనే ఆయా సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల ద్వారా ప్రజల భూహక్కులు కల్పించే విధంగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే ప్రజల ఆస్తులకు కఠినంగా మారిన లాండ్‌టైటలింగ్ యాక్ట్‌ను రద్దుచేశామన్నారు. కబ్జాదారుల నుంచి సామాన్యులకు రక్షణ కల్పించేందుకు భూదురాక్రమ నిరోధక చట్టాన్ని తీసుకు వస్తున్నామని చెప్పారు. ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చెయ్యడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు 85 వేలు రాగా అందులో 67 వేలు భూసమస్యలకు సంబంధించినవేనన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు లంచావతారం ఎత్తగా, మరికొందరు నేతల ఒత్తిళ్ళకు తలొగ్గడంతోనే భూసమస్యలు వచ్చాయని తెలిపారు. ప్రజల భూములను కాజేయ్యాలనే స్వార్థంతో గత ప్రభుత్వం రీసర్వే కూడా తప్పులుతడకగా నిర్వహించిందన్నారు. సర్వేచేసేటప్పుడు సంబంధిత యజమానులకు నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. రీసర్వేపై సమస్యలు చెప్పుకునేందుకు తగినంత సమయాన్ని కూడా ఇవ్వకపోవడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సదస్సుల నిర్వహణలో అధికారులు ఎవరైనా తప్పులు చేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. 33 రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులను విజయవంతం చేసేందుకు తాము రాత్రింబవళ్ళు కష్టపడ్డామన్నారు. సదస్సుల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటామని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు అప్పటికప్పుడు పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇబ్బందికరమైన సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలోపరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సుల ద్వారా అన్ని రకాల భూసమస్యలు పరిష్కరించి రైతులకు రాజముద్రతో పాస్‌పుస్తకాలను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషలాఫీసర్ శేషగిరిబాబు, ఆర్డీవో రామలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ సాయితేజ, తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

- చీరాల మండలం గవినివారిపాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలన్నారు. భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసే విధంగా చూడాలన్నారు. వివిధ రకాల భూ సంబంధమైన చిక్కుముళ్లతో బాధపడుతున్న వారందరికీ ఈ సదస్సులు పరిష్కారం చూపుతాయన్నారు. రెవెన్యూ రికార్డులు కోట్ల రూపాయల కన్నా విలువైనవని చెప్పారు. వీఆర్వోలు సక్రమంగా పనిచేస్తే ఎవరికీ సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గోపికృష్ణ, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.
- వేమూరు మండలం కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా లేబర్ అసిస్టెంట్ కమిషనర్, గ్రామ సభల నోడల్ ఆఫీసర్ బీవీ శివప్రసాద్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

వైసీపీ దుష్ప్రచారాలను నమ్మవద్దు

- మంత్రి గొట్టిపాటి రవి కుమార్

సత్తెనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉచితవిద్యుత్‌పై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజావేదికలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 200 లోపు యూనిట్లకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తామన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తేలేదన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తుందన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా.. బడి పండుగ

- నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్-టీచర్ మీట్
- చారిత్రక కార్యక్రమానికి వేదికగా బాపట్ల హైస్కూల్
- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్
- విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకం కానున్న సీఎం
- తల్లిదండ్రులకు పాఠశాలల్లో ఆటల పోటీలు.. భోజన ఏర్పాట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) సరికొత్తగా.. తొలిసారిగా.. ఆహ్లాదకర వాతావరణంలో, హంగు ఆర్భాటాలు లేకుండా, రాజకీయాలకు అతీతంగా, పూర్తిగా విద్యా సంబంధమైన వాతావరణంలో, ఆత్మీయ వాతావరణంలో, విద్యార్థులను ఉత్తేజపరిచేలా బడి పండుగ జరగనున్నది. మెగా పేరెంట్-టీచర్ మీట్ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించే సరికొత్త చరిత్రకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఢిల్లీ మినహా మిగిలిన ఏ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమం జరిగిన దాఖలాలు లేవు. ఏపీలో ఇలాంటి వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. శనివారం జరగబోయే ఈ కార్యక్రమానికి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా మారనుండగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తొలిసారి బాపట్ల జిల్లాకు రానుండటంతో పాటు ఓ మెగా కార్యక్రమానికి బాపట్లను వేదిక చేసుకోవడం విశేషం. పూర్తి ఆహ్లాదకర వాతావరణంలో పేరెంట్-టీచర్ మీట్ జరిపేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర అంశాలకు అవకాశం లేకుండా అంతా విద్యా సంబంధమైన వాతావరణమే కనబడేలా అధికారులు చర్యలు చేపట్టారు. హైస్కూల్ విద్యార్థులతో సీఎం మమేకమై వారికి భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయనున్నారు. తల్లిదండ్రులతో ముఖాముఖిలో ఇంటి దగ్గర పిల్లలకు కల్పించాల్సిన వాతావరణంతో పాటు ఉపాధ్యాయులతో క్రమం తప్పకుండా సమావేశమై విద్యార్థి ప్రోగ్రెస్ గురించి తెలుసుకోవాలని కూడా వారికి సూచించనున్నారు. హైస్కూల్‌లో భోజనాలకు ప్రత్యేకంగా కుటీరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లులకు నిర్వహించే ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేయగా తండ్రులకు టగ్గాఫ్‌వార్ నిర్వహించేందుకు క్రీడా వికాస కేంద్రాన్ని ముస్తాబు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

బాపట్లలో ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి అధికారి విధులను సమర్థంగా నిర్వహించాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఎస్పీ తుషార్‌డూడీ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించి బందోబస్తు విధుల గురించి దిశనిర్దేశం చేశారు. హెలీప్యాడ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్‌ను ఎస్పీ నిర్వహించారు. హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాట్లను విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సమగ్రశిక్షాభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిశీలించారు. బాపట్ల హైస్కూల్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా...

ఉదయం 10:20 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్న చంద్రబాబు అక్కడ ఐదు నిమిషాలు మాత్రమే నేతలతో మాట్లాడనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 10:30కు హైస్కూల్ చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1:30 వరకు మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో పాల్గొననున్న చంద్రబాబు 1:40కి తిరుగు పయనమై ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

మధురానుభూతిని మిగిల్చేలా..

మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అంతా ఒకే వేదికపైకి చేరడం మొదలు అందరూ కలిసి భోజనం చేయడం వరకు ప్రతిదీ ఓ మధురానుభూతిని మిగిల్చేలా అధికారులు కార్యక్రమం రూపొందించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పూర్వ విద్యార్థుల స్ఫూర్తి గాథలు విద్యార్థులకు తెలియజేసి వారిలో పోటీతత్వాన్ని పెంచనున్నారు. దాతలను కూడా ఈ వేదికపై నుంచి సన్మానించుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరగనున్నది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి పాఠశాలలు సిద్ధమయ్యాయి. అన్ని పాఠశాలల్లో తరగతి గదుల్ని విద్యార్థులు రంగు కాగితాలతో ప్రత్యేకంగా ఆలకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ వాతావరణంలో వేడుకల్ని నిర్వహించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల్ని, ఎమ్మెల్యేలను కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 6లక్షల మందికిపైగా విద్యార్థులు, 2లక్షలకుపైగా తల్లిదండ్రులు సమావేశాల్లో పాల్గొంటారని విద్యాశాఖ అంచనా వేస్తోంది.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దూడీ



జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక

చినగంజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు సిరిగిరి రంగారావు, ఈదర వెంకటసురేష్‌బాబు తెలిపారు. మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒంగోలులోని డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ ఇండోర్ స్టేడియంలో నవంబరు 24వ తేదీన జిల్లా జట్టుకు 18 మంది ప్రాపబుల్స్‌ని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో నవంబరు 26వ తేదీ నుంచి శుక్రవారం వరకు 18 మంది క్రీడాకారులకు కోచ్ మరపాల గిరిబాబు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన 12 మంది క్రీడాకారులను జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు అవసరమైన భోజన సదుపాయాలు, ఇతర వసతులను ప్రకాశం జిల్లా చీఫ్ పెట్రాన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు కల్పించినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సూదలగుంట ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే 71వ ఆంధ్ర రాష్ట్ర స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు పోకూరి శేషయ్య, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు భోగిరెడ్డి రామాంజనేయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు వివరాలు: పిట్టు బాలకృష్ణారెడ్డి(కెప్టెన్), కాయల వెంకటేష్, గాలి లక్ష్మారెడ్డి, గునిమిన సమరసింహారెడ్డి, ఆసోది సుబ్బారెడ్డి, గాలి రామకృష్ణ, పెళ్లేటి బ్రహ్మారెడ్డి, మంత్రు నాయక్, సోపర్ల మణి, గాలి లక్ష్మణ్, గొట్టు మలిఖార్జున్, కోట హరిప్రసాద్, కోచ్ ఎం.గిరిబాబు పాల్గొన్నారు.

దాతల సహాయాన్ని వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దాతల సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సంచార జాతుల వారికి ఎమ్మెల్యే ద్వారా టార్పాలిన్ పట్టను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి ఏసురత్నం, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజన్‌ల కోఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, భగవాన్, దాస్, సంచారజాతులకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

బ్యాంకులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

బల్లికురవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు బ్యాంకులపై అవగాహన ఉండాలని అంబడిపూడి యూనియన్ బ్యాంకు మేనేజర్ అజిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యాంకింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ బ్యాంకులో ప్రజలకు అందిస్తున్న సేవలపై విద్యార్థులకు వివరించారు. అకౌంట్ ఉన్నవారికి అందే సౌకర్యాలను తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌బాబు, ఉపాధ్యాయులు కుంచాల పార్వతి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మేదరమెట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలోని పతుల కాలనీలో నివాసం ఉండే బిహార్ రాష్ట్రానికి చెందిన వివాహిత శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పతుల కాలనీలో బిహార్ రాష్ట్రానికి చెందిన వసీం, సలీమా కాటున్ దంపతులు గత పదేళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. కొన్ని నెలలుగా భార్యాభర్తలు ఇద్దరికీ తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భర్త వసీం వేరే రాష్ట్రంలో పనికి వెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన సలీమా(39) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మొహమ్మద్ రఫీ పరిశీలించి స్థానికులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమెకు భర్త, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

జిల్లాలో 75మంది మగ ఆరోగ్య కార్యకర్తల తొలగింపు

- 2002 నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఉమ్మడి హైకోర్టుకు వెళ్లిన కొందరు నిరుద్యోగులు
- సుదీర్ఘ వాదనలు అనంతరం నోటిఫికేషన్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 75 మంది మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగిస్తూ వైద్యశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001-02 ఆర్థిక సంవత్సరంలో వైద్యశాఖ ద్వారా మగ ఆరోగ్య కార్యకర్తల నియామకాల కోసం నోటిఫికేషన్ జారీచేశారు. దీంతో అప్పటి అధికారులు ఆ నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా నియామకాలు చేశారు. అయితే ఈ నియామకాల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, కొందరు నిరుద్యోగులు అప్పట్లో ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘవాదనల అనంతరం గతనెల 29న తెలంగాణ హైకోర్టు ఆ నోటిఫికేషన్ రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ తీర్పు అమలుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 1500 మంది మగ ఆరోగ్య కార్యకర్తలు పనిచేస్తుండగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 75మంది పనిచేస్తున్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆ ఉద్యోగులను తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంకొకవైపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా ఆ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు పొందిన కార్యకర్తలు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో వారందరిని గుర్తించి నోటీసులు జారీచేశారు. ఇప్పటికే ఆ 75 మంది తొలగింపు ప్రక్రియ చేపట్టడంతో ఉద్యోగులలో ఆందోళన మొదలైంది. ఇప్పుడు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆ ఉద్యోగులను తొలగిస్తుండటంతో ఆ ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమయ్యారు.

నష్టం అపారం..!

- ఉరకెత్తుతున్న పొగాకు, శనగ
- కుళ్లిపోతున్న మినుము పైరు
- ఇతర పంటలపైనా వర్ష ప్రభావం
- రూ.100 కోట్లకుపైనే పెట్టుబడి నీటిపాలు
- వర్షం తెరపివ్వడంతో పంట రక్షణపై రైతులు దృష్టి
- ఐదు రోజుల్లో 74.70 మి.మీ సగటు వర్షపాతం

జిల్లాలో తాజాగా కురిసిన అకాల వర్షం పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రత్యేకించి ప్రస్తుతం రబీ పంటలు అధిక సాగు జరిగే జిల్లా దక్షిణ, తూర్పు ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాంతంలోనే భారీవర్షాలు పడటమే అందుకు ప్రధాన కారణం. నెలరోజుల వ్యవధిలోపు వేసిన పొగాకు, శనగ పైర్లు ఉరకెత్తిపోతుండగా మినుము పైరు కుళ్లిపోతోంది. ఇక ఖరీఫ్‌లో వేసిన పొగాకు, మిర్చి, వరి పంటల దిగుబడులపైనా వర్షాల ప్రభావం కనిపిస్తోంది. వర్షాలు తెరపివ్వడంతో రైతులు పొలాల్లోకి వెళ్లి పైర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నీటిని బయటకు పంపడటంతో పాటు మొక్కలను కాపాడుకునేందకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు.

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురిసిన వర్షం జిల్లాలో పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో, తూర్పు, దక్షిణప్రాంతంలో రబీ సీజన్‌లో అధికంగా పంటలు సాగుచేస్తారు. అలా నెలరోజులుగా తూర్పు, దక్షిణ ప్రాంతాలైన ఒంగోలు, ఎస్‌ఎన్‌పాడు, కనిగిరి, కొండపి నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో విస్తారంగా పొగాకు, శనగ సాగు జరుగుతుండగా కొన్నిచోట్ల రబీ ఆరంభంలోనే మినుము, అలసంద, వరి నాట్లు వేశారు. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ఇటీవల కురిసిన వర్షాలతో 50వేల ఎకరాల విస్తీర్ణంలో పైర్లు దెబ్బతినగా సగటున ఎకరాకు రూ.20వేల వంతున చూసినా రూ.100 కోట్ల మేర రైతాంగం పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో డిసెంబరులో పెద్దగా వర్షాలు ఉండవు. వర్షాల సీజన్ ముగిసి మంచు, చలి ప్రారంభమవుతుంది. ఈ నెల మొత్తం మీద జిల్లాలో సాధారణ సగటు వర్షపాతం 45.10 మి.మీ. అయితే ఊహించని రీతిలో ఐదు రోజుల్లో ఏకంగా 74.70 మి.మీ నమోదైంది. అందులో తూర్పు, దక్షిణ ప్రాంతంలోని దాదాపు పది, పన్నెండు మండలాల్లో 100 నుంచి 200 మి.మీ నమోదైంది. ఇతర ప్రాంతాల్లోనూ ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

పైర్లన్నీ నీళ్లలోనే..

కాగా అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో పొగాకు లేత తోటలు, తాజాగా వేసిన నాట్లు అలాగే శనగ పంట మొలక వచ్చి ఉన్నాయి. కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలలో ముదురు పొగతోటలు, అలాగే మినుము కాయదశలో ఉన్నాయి. అలాంటి పంటలన్నీ దెబ్బతిన్నాయి. లేత పొగతోటలు, తాజాగా వేసిన మొక్కలు ఉరకెత్తిపోతుండగా శనగ నీళ్లలోనే నానిపోతుంది. మినుము కాయ నాని పగిలి విత్తనాలు కుళ్లిపోతుండగా ముదురు పొగతోటలు మడ్డికారి నాణ్యత పోతోంది. ఇక కోతకు వచ్చిన వరి, మిర్చి, కంది పంటలకు నష్టం వాటిల్లింది. అధికారిక ప్రాథమిక అంచనా ప్రకారం.. జిల్లాలో పది మండలాల్లోని 103 గ్రామాల్లో సుమారు 26వేల ఎకరాలలో పంటలు దెబ్బతిని 7,650 మంది రైతులు నష్టపోయారు. అవన్నీ గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లోనివే. పంట చేతికొచ్చే దశలో ఉండి దెబ్బతిన్న వాటినే అధికారులు అంచనా వేశారు.

లెక్కలోకి రాని లేతతోటలు, మొలకలు

అయితే లేత పొగతోటలు, తాజాగా వేసిన నాట్లు, శనగ మొలక వచ్చిన భూములు కొండపి, ఎస్‌ఎన్‌పాడు, ఒంగోలు నియోజకవర్గాలు అలాగే దర్శి, వైపాలెం నియోజకవర్గాల్లో వరి, మిర్చిపై అధికారులు దృష్టిపెట్టలేదు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే ఎంత తక్కువ చూసినా కనీసం 50వేల ఎకరాలలో పంటలు దెబ్బతిని సుమారు రూ.100 కోట్ల మేర పెట్టుబడులు నీటి పాలయ్యాయి. ఉరకెత్తిన పొగ తోటలు, నీళ్లలో నానిపోయిన శనగ పైర్లు తిరిగి వేసుకోవాల్సి ఉండగా ఇతర పంటలపై వర్షాలు ప్రభావంతో దిగుబడులు తగ్గి రైతులు నష్టపోనున్నారు. కాగా శుక్రవారం వర్షం తెరపి ఇవ్వడంతో పొలాల్లో ఉన్న వర్షపు నీటిని బయటకు పంపి పంటలను కాపాడుకునే వైపు రైతులు దృష్టిసారించారు. అయితే మళ్లీ వర్షం పడితే మొత్తం పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల పరిశీలన

వేటపాలెం... బేస్తవారపేట, డిసెంబరు 6: నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పైర్లను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పరిశీలించారు. శుక్రవారం మండలంలోని పూసలపాడులో మినుము పైరును ఆయన పరిశీలించారు. పూత పిందె రాలడాన్ని గమనించినట్లు తెలిపారు. సలకలవీడులో శనగ పంటలను పరిశీలించారు. రైతులు పురుగుమందుతో పాటు మల్టీకే పైపాటుగా స్ప్రే చేయాలన్నారు. రైతులు తప్పనిసరిగ్గా పంట నమోదు చేసుకోవాలన్నారు. దీంతో పాటు శనగ, మినుము, మిర్చి, జొన్న, మొక్కజొన్న పంటలకు బీమా చేయించాలని రైతులకు సూచించారు. ఈ నెల15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డి.బాలాజీనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారులు శ్రీనివాసనాయక్, షేక్.మహబూబ్‌బాషా, ఏవో జక్కం మేర్సీ పాల్గొన్నారు.



కొండపిలో మోటార్‌తో పొలంలోని నీటిని వెలుపలకు పంపుతున్న రైతు

మిరప పంట పరిశీలన

గిద్దలూరు : తుఫాన్ వర్షాల నేపథ్యంలో రాచర్ల మండలం ఆకవీడులో మిరప పైరును జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపిచంద్ పరిశీలించారు. పంట పొలాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కాలువల ద్వారా వెంటనే బయటకు పంపుకోవాలన్నారు. పైపాటుగా యూరియా, 19:19:19, 13.04.45 మందులను మొక్కలకు పిచికారీ చేయాలని సూచించారు. మిరపలో తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. మిరప సాగు చేసే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.525 ప్రీమియం ఎకరాకు చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. బ్యాంక్ ద్వారా పంట సాగుకు రుణాలు తీసుకుని ఉంటే బ్యాంక్ ద్వారానే ప్రీమియం చెల్లించవచ్చన్నారు. పంట నష్టపోతే గరిష్ఠంగా ఎకరాకు 1.05లక్షల వరకు బీమా వస్తుందన్నారు. ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ, సిబ్బంది వరలక్ష్మి,మధుశంకర్ పాల్గొన్నారు.

నీటిని బయటకు పంపేందుకు రైతుల ప్రయత్నాలు

కొండపి : భారీవర్షాలకు పొగాకు, శనగ పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. గడచిన పది రోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలతో భూమి పదునెక్కింది. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షంతో పొలాలు పూర్తిగా నీట మునిగాయి. చేలల్లో నిలిచిన నీటిని వెలుపలకు పంపే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొండపి మండలం ముప్పవరం వద్ద ఓ రైతు చిన్న మోటార్ పెట్టి పొగాకు తోటలోని నీటిని వెలుపలకు పంపింగ్ చేస్తున్నాడు. అదేవిధంగా పెరిదేపి వద్ద కౌలుకు తీసుకుని పొగాకు వేసిన మిట్టపాలెం గ్రామానికి చెందిన దర్నాశి శ్రీనివాసరావు తన పొలంలో వాలు కాలువలు తీసి నీటిని వెలుపలకు పంపే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పొలాల్లోకి చేరిన నీటిని బయటకు పంపుతున్నానని, శుక్రవారం పగలంతా ఎండ కాయడంతో పొగమొక్కలు, శనగ మొక్కలు ఉరకెత్తి పోతున్నాయని శ్రీనివాసరావు వివరించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

నూతలపాడు/పర్చూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతు సంతోషంగా ఉంటేనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నూతలపాడులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ రంగాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాగు నీటిని అందించే విధంగా ప్రణాళికతో పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 2015-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలను అద్భుతంగా తీర్చిదిద్ది ఆయకట్టు చివరి భూములకు సైతం నీరు అందించామని ఏలూరి గుర్తు చేశారు. అనంతరం వచ్చిన జగన్‌రెడ్డి వాటిని విస్మరించారన్నారు. దీంతో కాలువలు, చిల్లచెట్లు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అభివృద్ధి చేసి రైతులకు సాగు నీరు సక్రమంగా అందేలా చూస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక విజన్‌తో ముందుకు సాగుతున్నారన్నారు. రైతుల కోసం గోడౌన్‌లను కూడా నిర్మిస్తామన్నారు. రైతుల భాగస్వామ్యంతో ఉన్న సొసైటీ బ్యాంక్ సారథ్యంలో పెట్రోలు బంక్‌లను ఏర్పాటు అభినందనీమన్నారు. కార్యక్రమంలో సీఈవో బిందు ప్రత్యూష, జీఎం కుంబా రాఘవయ్య, డీసీవో శ్యాంసన్, పర్చూరు పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు కంచేటి శ్రీహరి, విన్నకోట సతీష్ పాల్గొన్నారు.

పచ్చి మిర్చి రైతుల రాస్తారోకో

- దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని ఆగ్రహం



కొమ్మాలపాడులో నామ్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కొమ్మాలపాడు(అద్దంకి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దళారులు కుమ్మక్కై పచ్చి మిర్చి ధరలను రోజు రోజుకు తగ్గిస్తున్నారని సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో శుక్రవారం రాత్రి రైతులు రాస్తారోకో చేశారు. బహిరంగ మార్కెట్‌లో పచ్చి మిర్చి క్వింటాల్ ధర 2,500 నుంచి రూ.3వేలు ఉండగా, కొమ్మాలపాడులో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై క్వింటాల్ రూ.1200 నుంచి రూ.1300కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 15 రోజులుగా వ్యాపారులు, దళారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ధరలను దిగజారుస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చి మిర్చి సాగు చేసే రైతులలో అత్యధిక శాతం చిన్న, సన్న కారు రైతులు కావడంతో పెట్టుబడులకు స్థానికంగా ఉండే ఎరువుల దుకాణాల వ్యాపారులను ఆశ్రయించడంతో ప్రస్తుతం దిగుబడి వచ్చిన మిర్చిని వ్యాపారుల కనుసన్నలలో ఉండే దళారులు ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి రైతులు పెద్ద సంఖ్యలో నామ్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ రెండు వైపులా నిలిచిపోయింది. సంతమాగులూరు పోలీసులు చేరుకొని విరమింప చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, లేదంటే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని రైతు సంఘం నేత ఖాదర్ బాషా తెలిపారు.

శీనారెడ్డి అక్రమాలపై విచారణ ప్రారంభం

డ్వామా కార్యాలయంలో లోకేశ్వరరావు బృందం

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పూర్వ పీడీ కే .శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో కమిటీ విచారణ ప్రారంభించింది. ఆయనతోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులైన స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలు శుక్రవారం డ్వామా కార్యాలయంలో ఈ విచారణను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో డ్వామా పీడీగా శీనారెడ్డి 2014-19 మధ్య దాదాపు నాలుగేళ్లు పనిచేశారు. సహకార శాఖకు చెందిన ఆయన డిప్యుటేషన్‌పై అందులో పనిచేశారు. జిల్లా వాసి అయిన శీనారెడ్డి నాటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో ఇష్టారీతిన వ్యవహరించాడన్న విమర్శలు వచ్చాయి. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్ ప్రభుత్వానికి శీనారెడ్డిపై పలు ఫిర్యాదులు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ ఒకవైపు సాగుతుండగా పొదిలికి చెందిన మహిళా న్యాయవాది ఒకరు వేసిన పిటిషన్‌పై లోకాయుక్తా విచారణలో ఉంది. మరోవైపు జిల్లాకు చెందిన మరో నలుగురైదుగురు వివిధ రూపాలలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఫిర్యాదుల వెల్లువ

శీనారెడ్డి అక్రమాలపై జిల్లాకు చెందిన మంత్రి స్వామితోపాటు పలువురు ఎమ్మెల్యేలకు ఆలాగే ఫిర్యాదులు వెళ్లాయి. ఇలా పలు వైపుల నుంచి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు చేరడంతో వాటన్నింటిపై సమగ్రంగా విచారణ నిర్వహించి నివేదించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను గ్రామీణాభివృద్ధి ఉన్నతాధికారులు ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి శంకరనారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలను కమిటీగా కలెక్టర్ నియమించారు. దీంతో ఆ కమిటీ విచారణ ప్రారంభించింది. లోకేశ్వరరావు, శ్రీమన్నారాయణ డ్వామా కార్యాలయానికి శుక్రవారం వెళ్లారు. రెవెన్యూ సదస్సులకు చీమకుర్తి మండలానికి స్పెషలాఫీసర్ అయిన ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్ చీమకుర్తికి వెళ్లగా డ్వామా కార్యాలయంలోని పలువురు సూపరింటెండెంట్లను పిలిచి విచారణ కమిటీ సభ్యులు మాట్లాడారు. ప్రధానంగా శీనారెడ్డి అమలుచేసే పథకాలు, సంబంధిత విభాగాల పర్యవేక్షకుల వివరాలను సేకరించారు.

సరికొత్త ఒరవడి

- నేడు ఒకే వేదికపైకి తల్లిదండ్రులు, గురువులు
- పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా జిల్లాలోని 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించి విద్యార్థులకు స్ఫూర్తిని నింపే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా పాఠశాలల్లో జరిగే సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపారు. శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో జరిగే ఈ మీటింగ్‌కు ఏదో ఒక పాఠశాలలో పాల్గొనే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వారు ఎంపిక చేసిన పాఠశాలల్లో పాల్గొనున్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, ముండ్లపాడు హైస్కూలులో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కంచర్లవారిపల్లి జడ్పీ హైస్కూలులో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురంలో జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలో, ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రకాశం కాలనీలోని ఎంపీపీఎస్ స్కూలులో, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలు, మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి హైస్కూలులో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పాల్గొంటారు. కాగా ఆయా పాఠశాలల్లో భారీ ఏర్పాట్లను చేస్తున్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

కనిగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో పేదలకు ప్లాట్లు వేసి కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా చేసిందని ఆరోపించారు. కనీసం ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండానే చెరువులను తలపించే చోట ఇళ్ళను నిర్మించారన్నారు. దీంతో కాలనీలన్నీ నిరుప యోగంగా మారాయన్నారు.

ఈనెల 11న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కనిగిరి వస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చెప్పారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నాగులచెరువులోకి నీరు చేరటం ద్వారా భూగర్భజలాలు పెంపొంది వేసవికాలం లో నీటి ఎద్దడి సమస్య తగ్గనుందన్నారు. ఓవీ రోడ్డు నిర్మాణం ఆరు నెలల్లో ప్రారంభించటం జరుగుతుందన్నారు. ట్రిపుల్ ఐటీ నిర్మాణంతో పాటు అతిత్వరలో రిలయన్స్ గ్యాస్ పరిశ్రమను ప్రారంభించనున్నట్లు చెప్పారు. డయాలసిస్ యూనిట్‌ను 2 షిఫ్టులలో చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. నవోదయ స్కూల్ ఏర్పాటుకు ఎంపీ మాగుంట కృషి చేయనున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. మూడు నెలల్లో బైపాస్ రోడ్డు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో కనిగిరి పదో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిరంజీవి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు బడి పండుగ

చినగంజాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరగనున్న బడి పండుగ కార్యక్రమంలో పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొన్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, సయ్యద్ అబ్దుల్‌కలాంఆజాద్‌లు తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే బడి పండుగ కార్యక్రమంపై శుక్రవారం వారు పాఠశాల హెచ్.ఎం డి.రత్నకుమారితో చర్చించారు. పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ కార్యక్రమానికి నాయకులు స్థల పరిశీలన చేసి, హెచ్.ఎంకు పలు సూచనలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే ఏలూరి చర్చించనున్నట్లు వీరయ్య తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వెలుగు కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులకు రూ.30 లక్షల రూపాయిల విలువ చేసే ఎలక్ట్రికల్ ట్రై మోటారు సైకిల్స్‌ను 11 మంది దివ్యాంగులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల హెచ్‌ఎంతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఇసుక రవాణాలో నిబంధనలు పాటించాలి

మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్

చీరాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అవసరాలు ఉన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఈపూరుపాలెం - స్వర్ణపురం ప్రాంతాల మధ్య రెండు ఇసుక ట్రాక్టర్‌లను ఆయన పట్టుకున్నారు. ఈక్రమంలో రవాణా దారులను ఆరా తీశారు. కచ్చితంగా ఇసుక పాలసీ విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్చరించారు. రెండు వాహనాలకు చలానా విధించారు. ఆయన వెంట పలువురు మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

నేడు ప్రతిభామూర్తుల సభ

అద్దంకి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు బంగ్లా రోడ్డులోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో ప్రతిభామూర్తుల సభ జరుగుతుందని అధ్యక్షుడు కోటయ్య తెలిపారు.

రక్తహీనతను గుర్తించాలి

బల్లికురవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రక్త హీనతతో ఉండే చి న్నారులను గుర్తించి వారికి పోషణ ఇచ్చే అహారాన్ని అందించాలని సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ కోరారు. శుక్రవారం మండలంలోని కూకట్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో తనిఖీ చేశారు. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. వారి ఎదుగుదలను గమనించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ప్రోగ్రాంను నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సలోమి, అంగన్ వాడీ కార్యకర్త లక్ష్మి సుశీల పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు విలువైనవి

కలెక్టర్ వెంకటమురళి


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

చీరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డులు కోట్ల రూపాయల కన్నా విలువైనవని కలెక్టర్ వెంకటమురళి చెప్పారు. మండల పరిధిలోని గవినివారిపాలెంలో శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదుస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వీఆర్వోలు సక్రమంగా పనిచేస్తే ఎవరికీ సమస్యలు ఉండవన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈ సదస్సుల ద్వారా సమస్యలను పరిష్క రించుకోవాలన్నారు. సదస్సులో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తామన్నారు. వాటిని పరిష్కరించే బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. భూ కబ్జాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించిందన్నారు. రీ-సర్వే, అడంగల్‌లో చేర్పులు, మార్పులు, సర్వే నెంబర్ల సవరణ, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు, విక్రయాలు, పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత జాబితా నుంచి తొలగించినవాటి వివరాలు తదితరాలకు సంబంధించి ప్రజలు అర్జీల ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ భూ సంబంధిత అన్ని సమస్యలకు రెవెన్యూ సదుస్సులలో పరిష్కారం దొరుకుతుందన్నారు. సాగునీరు అందకపోయినా, భూ ఆక్రమణలు జరుగుతున్నా వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ఉందన్నారు. ముందుగా తహసీల్దార్ గోపీకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదవి వినిపించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేటపాలెం : పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 4 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించి ని ర్ణీత వ్యవధితో పరిష్కరిస్తామని స్పెషల్ ఆఫీసర్ డెబోరా తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, ఎండోమెంట్ ఈవో శ్రీనివాసరావు, వీఆర్వో ప్రశాంతి, కార్యదర్శి రామ్మోహన రావు పాల్గొన్నారు.

చినగంజాం : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయ న మాట్లాడారు. భూ సర్వే కోసం ఒకటి, పాసుపుస్తకాలకు ఐదు అర్జీలను రైతులు అందజేసినట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సు బ్బారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులలో 16 అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. కోనంకి గ్రామంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ టీ ప్రశాంతి 12 అర్జీలను స్వీకరించారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 10, భూ సర్వేకు 2 అర్జీలు అందాయి. చిమ్మిరిబండలో డిప్యూటీ తహసీల్దా ర్ నాగలక్ష్మి నాలు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయరు ఏడుకొండలు, ఆర్ఐ రహమాన్ బాషా, సబ్‌రిజిస్ట్రార్ జూనియర్ సహాయకులు శ్యాంప్రసాద్,ఎండోమెంట్ ఈవో శిరీష పాల్గొన్నారు.

యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో తహసీల్దార్ కే రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలను ప్రజలు అందజేశారు. ఆన్‌లైన్‌లో పేర్ల నమోదుకు 5, భూసర్వేకు 2, ఇతర సమస్యలపై అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. సర్వేయర్ సాంబశివరావు, డీటీ మస్తానరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇడుపులపాడులో జరిగిన సదస్సులో మొత్తం 27 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పర్చూరు : భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సద స్సులు అని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పుటూరులో జరిగిన సదస్సులో ఆయన సర్వేకు సంబంధించి 2, ఎండోమెంట్ భూముల ఆక్రమణకు 4, పాస్ పుస్తకాల సవరణకు 12 అర్జీలను రైతుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఎన్.హరికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొడ్డువానిపాలెంలో సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరేళ్ల సుబ్బయ్య, ఆర్ఐ కృష్ణమోహన్, సర్వేయర్ మహేష్‌బాబు, వీఆర్వో మారుతి, పంచాయతీ కార్యదర్శి దుర్గ, టీడీపీ నాయకులు చింతం సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నేత భూ ఆక్రమణపై మహిళా రైతుల ఫిర్యాదు


భూ ఆక్రమణ పై ఫిర్యాదు చేస్తున్న మహిళా రైతులు

అద్దంకి : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి భీమయ్య అన్నారు. మండలంలోని మణికేశ్వరంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సులో 37అర్జీలు అందాయి. కొంగపాడుకు చెందిన మహిళా రైతులు కమ్మ సావిత్రమ్మ, వెంకట సుజాత తమ భూమిని వైసీపీ నేత దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని, అప్పటి అధికారులు వైసీపీ నేతకు సహకరించారని ఫిర్యాదు చేశారు. అందిన అర్జీలలో 7 రెవెన్యూ పరమైనవి కాగా, మిగిలిన 30అర్జీలు పునరావాస కాలనీకి సంబంధించినవి ఉన్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, టీడీపీ నేత షేక్ కరిముల్లా పాల్గొన్నారు



స్వామివారికి కావిళ్లు సమర్పిస్తున్న భక్తులు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి

మేదరమెట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణంరాజువారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో కలశాలను ఊరేగించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాలధారులు కావిళ్లతో నగరోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి 46 అడుగుల ఏకశిలా విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

అద్దంకిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు, విద్యార్థులందరూ ఫ్లోరోసిస్‌తో కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ నోడల్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ధర్మవరం, గోపాలపురం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా తాగు నీటిలో ఫ్లోరైడ్ పరిమితి 0.7 నుంచి 1.2 పీపీఎం వరకు ఉండవచ్చునని, అంతకంటే ఎక్కువ ఉంటే దంతాలకు ఫ్లోరోసిస్ వస్తుందన్నారు. ఈ వ్యాధి వలన దంతాలు పసుపు లేదా గోధుమ రంగు నుంచి నలుపుగా మారతాయన్నారు. ముఖ్యంగా పిల్లల దంతాలు ఫ్లోరోసిస్‌కు గురవాయని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ అబ్దుల్ సత్తర్, ఏఎన్ఎంలు రాజేశ్వరి, శివపార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ మెర్సీ మౌనిక, విజయ, ఆశాలు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలకు రుణాలు

» కెనరా బ్యాంక్ జీఎం విజయలక్ష్మి

బల్లికురవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో కార్మికులకు ఉపాధి కల్పించేలా పరిశ్రమలకు పెద్ద ఎత్తున రుణాలను అందిస్తామని విజయవాడ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరంలోని లలిత గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద బల్లికురవ, మార్టూరు మండలాల పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో కెనరా బ్యాంకు అధికారులు సమావేశం నిర్వహిచారు. రెండేళ్లలో బల్లికురవ ప్రాంతంలో పరిశ్రమలకు రూ.50 కోట్ల రుణాలను అందించినట్లు విజయలక్ష్మి వివరించారు. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేవారికి రుణాలను అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏజీఎం రమామోహన్, డీబీసీ ఉమాశంకర్, మార్టూరు, చిలకలూరిపేట శాఖల మేనేజర్లు రాజశేఖర్, మహేష్, గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, యజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ జీఎం విజయలక్ష్మి

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

ఎమ్మెల్యే కొండయ్య


డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడర్‌ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ముక్కోణపు పార్క్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజవకర్గ పరిధిలో పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

పర్చూరు : అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నూతలపాడు ఏలూరి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్ ఖ్యాతిని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు జూపూడి మార్క్స్, అబ్రహం, షేక్ షంషుద్దీన్, కంచేటి శ్రీహరి, విన్నకోట సతీష్ పాల్గొన్నారు. అలాగే పర్చూరులోని బొమ్మల సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత నేతలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అంబేడ్కర్ అందరివాడని వక్తలు కొనియాడారు. వివిధ సంస్థలు, పాఠశాలు, కాలేజీల్లో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. బంగ్లారోడ్డులో ఉన్న విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ప్రజా సంఘాల నాయకులు నివాళుల ర్పించారు. మైలవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుద్ధిజం - పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్యాసరచన నిర్వహించారు. విజేతలకు ఎంఈవో గంగాధరరావు, బుద్ధిస్ట్ ఆర్గనైజషన్ బాబూరావు బహుతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

మార్టూరు : గన్నవరం రోడ్డులో వివిధ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో కార్యక్రమం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ బాషా, అచ్యుతరామరాజు, రామయ్య, సుజాత పాల్గొన్నారు.

చినగంజాం : సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, సామేలు, నాగరాజు, వీరాస్వామి, రాజే ష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అద్దంకిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐక్య వేదిక సభ్యులు, చినగంజాంలో టీడీపీ నేతల నివాళి

గ్రామాలలో మెరుగైన సేవలు అందించాలి

» ఎమ్మెల్యే ఏలూరి » 16 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాల అందజేత


అంగన్వాడీలకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలు పేద మధ్యతరగతి కుటుంబాలలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో కొత్తగా నియమితులైన 15 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఒక హెల్పర్‌కు నియామకపత్రాలను ఎమ్మెల్యే ఏలూరి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అంగన్వాడీలపైనే ఉందన్నారు. చిన్నారులకు ఆరోగ్యం, విద్యను అందించే లక్ష్యంగా పనిచేయాలని ఏలూరి సూచించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టిక ఆహారాన్ని అందించి అందరూ ఆరోగ్యంగా ఉండేలా బాధ్యతతో పనిచేయాలన్నారు. కేంద్రాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో చిన్నారులంతా అంగన్‌వాడీలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంతోపాటు కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బాధ్యతతో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఏలూరి ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీడీపీవో సుభద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.


మంత్రి ప్రారంభించనున్న ప్రభుత్వ కార్యాలయాలు

చందలూరులో నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

పంగులూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం చందలూరు గ్రామంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు గ్రామంలో నూతనంగా నిర్మితమైన గ్రామ పంచాయతీ కార్యలయం, రైతు సేవా కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నూతన భవనాలు, పలు సీసీ రోడ్లను మంత్రి గొట్టిపాటి ప్రారంభించనున్నారు. అనంతరం 9.30 నిమిషాలకు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సంయుక్త సమావేశంలో పాల్గొంటారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. శనివారం రాష్ట్ర మంత్రి గొట్టిపాటి పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో కె.స్వరూపారాణి, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, నేతలతో కలసి పరిశీలించారు.

9న కేఆర్‌కే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అద్దంకిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్ మేళాలలో గ్లోసరి స్టాఫ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ మినీ ఫైనాన్సియర్స్ లిమిటెడ్ వారు హాజరవుతారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ పూర్తయిన, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థినీవిద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు రెజ్యూం, సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో 9వ తేదీన ఉదయం 9.30గంటలకు కళాశాలలోని సెమినార్ హాలులో హాజరు కావాలని జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.షర్మిలారాణి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ ఏ.శిఖామణి తెలిపారు. వివరాలకు కళాశాలలోని జేకేసీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్‌గా రవినాయక్ బాధ్యతలు


తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

బల్లికురవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్‌గా ఎం.రవినాయక్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన కవిత సీసీఎల్‌కు బదిలీ అయ్యారు. సెక్రటరియేట్‌లో పనిచేస్తున్న రవినాయక్‌ను అధికారులు బల్లికురవకు బదిలీ చేశారు. తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్‌లు రవికుమార్, ప్రహర్ష, ఏఎస్‌వో అమరనాథ్, కార్యాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ రవినాయక్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతులు నేరుగా సమస్యలను తన దృష్టికి తేవాలని కోరారు.

10న ఆత్మీయ సమ్మేళనం

చినగంజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సంతపేటలోని రంగాభవన్‌లో ఈ నెల 10న జరిగే నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని వాయిద్య కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు రామాంజనేయులు, నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్కాపురం వెంకటరామారావు కోరారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చుండిబజారులోని కమిటీ స్థలంలో ఆత్మీయ సమ్మేళన కరపత్రాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంల గ్రామ సంఘ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, నియోజకవర్గ కన్వీనర్ నటరాజ్, లక్ష్మయ్య, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవల్లో అందరూ దాతృత్వం చాటుకోవాలి

చీరాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వృద్ధులకు, నిరుపేదలకు, అనాథ చిన్నారులకు సాయం అందించి అందరూ దాతృత్వాన్ని చాటుకోవాలని గుంటూరు శంభుప్రియ సేవా సమితి ప్రతినిధులు అన్నారు. శుక్రవారం కోటయ్య వృద్ధాశ్రమానికి సేవా సమితి ప్రతినిధులు సాయం అందించారు. నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు ఇతర వస్తువులను పెద్దఎత్తున అందించారు. సుమారు 15 ఏళ్లుగా ఆశ్రమానికి సాయం అందిస్తున్నట్లు వారు వివరించారు. దాతల సాయంతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఆశ్రమ ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కన్నయ్య, సుగుణ, శ్రీవైష్ణవి, గాయత్రి, సరస్వతిదేవి, మౌనిషా సీత, సీతారత్నం, వేదావతి, రేణుకాదేవి, మార్కండేయులు, రాజేశ్వరి, ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

చీరాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని పాత చీరాలకు చెందిన నిందితుడు వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనంచేసుకుని కేసు నమోదు చేశారు.

కడుపు నొప్పితో మూడేళ్ల చిన్నారి మృతి

బల్లికురవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొరుగు రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ దంపతుల కుమార్తె కడుపు నొప్పితో మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం కొంతకాలం కిందట మంగేష్, రంజిత దంపతులు మాల్లాయపాలెం గ్రామ క్వారీలలో పనులకు వచ్చారు. వీరికి మూడేళ్ల వయస్సు పాప డింపుల్ ఉంది. నాలుగు రోజుల కిందట కడుపు నొప్పి రావడంతో చిలకలూరిపేటలో వైద్యం చేయించి, గుంటూరు ఆసుపత్రికి తరలిస్తుండగానే పాప మృతి చెందింది. పాప మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహాన్ని మల్లాయపాలెం తీసుకు వచ్చి ఖననం చేశారు.ట


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికముగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏ.ఈ.ఈ పి.గణనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మున్నంవారిపాలెం, సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని గణనారాయణ కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న పాల ట్యాంకర్


ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

కొమ్మాలపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న ట్రాక్టర్‌ను పాలట్యాంకర్ ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న రైతు కరిముల్లాకు తీవ్రంగా గాయాలయ్యాయి. 108లో నరసరావుపేటకు తరలించారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ పూర్తిగా దెబ్బతిన్నది.



'సోమశిల'కు 13,407 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి శుక్రవారం 13,407 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.692 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయంలో నీటినిల్వ 18 అడుగులకు చేరుకుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 880 క్యూసెక్కుల వరద వస్తోంది.

● రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరులో 54.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 3400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1795 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.



కోవూరులో జరుగుతున్న ఏర్పాట్లు

నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా

రారండోయ్.. పండగ చేద్దాం!

విద్యావ్యవస్థలో అతిపెద్ద పండుగను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతం చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారు. విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం మార్గనిర్దేశం చేయడంతోపాటు విద్యార్థుల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వారధిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

6

పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వానిస్తూ పత్రిక అందజేస్తున్న విద్యార్థులు



తొలిరోజున 45 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

అందిన అర్జీలు 430..
పరిష్కారం 14

గడువులోపు మిగిలినవి పరిష్కరిస్తామన్న అధికారులు

నెల్లూరులో పాల్గొన్న మంత్రి నారాయణ, కలెక్టర్

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా 45 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తొలిరోజున 430 అర్జీలు అధికారులకు అందగా, 14 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎక్కువగా భూ రికార్డులు తారుమారు చేశారన్న ఫిర్యాదులు అందాయి. కొన్నిచోట్ల తమ భూమిని మరొకరు ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదులు కూడా వచ్చాయి. మండల స్థాయి రెవెన్యూ సిబ్బంది మొత్తం రికార్డులతో సహా ఈ సదస్సులకు హాజరయ్యారు. తహసీల్దార్‌తోపాటు మండల ప్రత్యేకాధికారులు సదస్సులో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ సదస్సులను ఆర్డీవోలు పర్యవేక్షించారు. కాగా నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో జరిగిన సదస్సులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్ కూడా పాల్గొన్నారు. మనుబోలు మండల కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కావలి మండలం రుద్రకోటలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● ప్రజల ఆస్తులకు భద్రతకే సదస్సులు

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆస్తికి భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.



మనుబోలులో రైతులనుంచి అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



తహసీల్దారు ఎదుట వాపోతున్న రైతులు

శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్‌నగర్ వార్డు సచివాలయంలో రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తూ గత ప్రభుత్వ పాలకులు వేల ఎకరాల భూములను కబ్జాచేశారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఉండే లోపాలను సరిదిద్ది నిజమైన అర్హుడికే న్యాయం చేసేలా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో వచ్చిన భూసమస్యలను నెలరోజుల్లోగా అధికారులు పరిష్కరిస్తారన్నారు. అనంతరం మంత్రి నారాయణ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వీలైనంత త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అధికారులు మారినప్పుడల్లా
అర్జీలంటే ఎలా!?

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): 'అధికారులు మారినప్పుడల్లా భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వమంటే ఎలా? మాది వలస ప్రాంతం. అందరూ అందుబాటులో ఉండరు.' పలువురు రైతులు అధికారుల ఎదుట వాపోయారు. శుక్రవారం మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తమ భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దారు సుభద్రకు రైతులు అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న అధికారులకు అర్జీలు ఇవ్వగా వారు పట్టించుకోలేదని, మరలా అర్జీలు ఇవ్వాలంటే వ్యయప్రయాసాలు ఎదుర్కోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, డీటీ హసీనా, వీఆర్వో అంజాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు. దుత్తలూరు మండలం తిమ్మాపురంలో తహసీల్దారు వై.నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

● వర్ధంతి సభలో మంత్రి నారాయణ పిలుపు

అంబేడ్కర్ పోరాట పటిమను
స్ఫూర్తిగా తీసుకోండి!

అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన బాబాసాహేబ్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాటమంతా బహుజనుల రాజ్యాధికారం దిశగానే సాగిందని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. అంబేడ్కర్ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

\- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



పోలీసుల్లాగే హోంగార్డులకూ

ప్రయోజనాలు

● వరాలు ప్రకటించిన ఎస్పీ 6

పైపై పూత...
నిధుల మేత

● రూ.6.5 కోట్లతో ఉదయగిరి రోడ్డు నిర్మాణ పనులు

● వేసిన కొద్దిరోజులకే రహదారి ఛిద్రం

ఈ రోడ్డును గమనించారా!?. ఇదేదో మారుమూల ప్రాంతంలోని రోడ్డు అనుకుంటే మీరు పొరబడ్డట్టే. ముంబయి జాతీయరహదారిలోని నందవరం నుంచి ఉదయగిరి వైపు వెళ్లే రోడ్డు ఇది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఇటీవల ప్యాచ్ వర్కులు చేశారు. రోజులు గడవక ముందే ఎలా దెబ్బతిన్నదో చూడండి. కాంట్రాక్టర్ కక్కుర్తి.. ఆర్అండ్‌బీ అధికారుల ఉదాసీనతే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లా కేంద్రం నెల్లూరు నుంచి ఉదయగిరి వెళ్లాలంటే ముంబాయి హైవేలోని నందవరం నుంచి 15 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. నందవరం నుంచి పెద్దమాచునూరు వరకు అంటే 14 కి.మీ పొడవున రోడ్డు అధ్వానంగా ఉండటంతో మరమ్మతు చేయడానికి ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. వెంటనే ప్రభుత్వం రూ.6.5 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆ వెంటనే టెండర్లు పిలవడం.. కొత్తగా రోడ్డు వేసేందుకు ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకోవడం చకచకా జరిగిపోయాయి. మూడు నెలల క్రితం ప్రారంభమైన పనులు నత్తతో పోటీ పడేలా జరిగాయి. ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటిదాకా జరిగిన పనులను చూసి వాహనదారులు నివ్వెరపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుమొత్తం ధ్వంసమై గుంతలమయంగా మారిపోయింది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రోడ్డు సమస్య కూటమి ప్రభుత్వంలో జరిగిందనే ఆనందం మరువక ముందే నిర్మాణంలో నాణ్యతా లోపం బయట పడటంతో ఇటు వాహనదారులు, అటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నాణ్యతపై ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై ఆర్అండ్‌బీ అధికారులు వివరణ కోరేందుకు ప్రయత్నించగా, పొంతనలేని సమాధానం చెబుతూ తప్పించుకోవడం గమనార్హం.

\- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)





నందవరం-ఉదయగిరి రోడ్డుకు అటు ఇటు గుంతలే!



బండేపల్లి-డేగపూడి కాలువ పనులు (ఫైల్)

కాలువ పూర్తయ్యేనా..
నీటి కష్టాలు తీరేనా!?

- బండేపల్లి-డేగపూడి కాలువ పనులకు గ్రహణం
- మట్టి పనులు చేసి ఆపేసిన కాంట్రాక్టర్
- గత ప్రభుత్వంలో సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వైసీపీ నేత
- పనులు చేయకపోవడంతో నోటీసు ఇచ్చిన అధికారులు
- అయినా పనులు మొదలుపెట్టని వైనం
- తాజాగా సీఈకి లేఖ రాసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు మూడు దశాబ్దాల రైతుల కల బండేపల్లి-డేగపూడి కాలువ. సుమారు పది వేల మంది రైతులు, ఇరవై వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగడంలో కీలకమైన ఈ కాలువ మనుబోలు, పొదలకూరు మండలాల రైతులకు చాలా ముఖ్యమైనది. రాజకీయ జోక్యంతో గడిచిన ఐదేళ్లూ పడకేసిన కాలువ పనులకు కూటమి ప్రభుత్వంలోనైనా మొదలుపెట్టాలని రైతులు వేడుకొంటున్నారు. ఇటీవల రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకురాగా ఆయన పనులు మొదలుపెట్టించాలని చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాశారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న వైసీపీ నేత పనులు ప్రారంభించడం లేదు.

- వివరాలు 6లో..



పర్యాటకం అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పర్యాటక రంగం అభివృద్ధికి
ప్రణాళికలు సిద్ధం చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పర్యాటక, దేవదాయ, అటవీశాఖ పరిధిలోని దర్శనీయ ప్రదేశాల పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. టూరిజం అడ్వెంచర్ స్పోర్ట్స్, రోప్‌వే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. బారాషహీద్ దర్గా, సైన్స్ మ్యూ జియం, చిల్డ్రన్స్ పార్కు, నగరవనం వంటి చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలను విద్యార్థులంతా సందర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాలకు పర్యా టక రంగం గొప్పతనం తెలిసేలా చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యతను వివరిస్తూ డాక్యుమెంట్లను తయారు చేసి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచా రం చేయాలని సూచించారు. సోమశిల అడవిలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఉదయగిరి దుర్గం వద్ద రోడ్ల అభివృద్ధికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. పురావస్తు శాఖ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డీఎం టూరిజం శ్రీనివాస్, జిల్లా డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈవో బాలాజీరావు, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడుతున్న
పేదోళ్ల బియ్యం!

కావలిలో 995 బస్తాల రేషన్ బియ్యం, నూకలు స్వాధీనం

కావలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం, నూకలను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను శుక్రవారం ఉదయం కావలి ఒకటవ పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఫిరోజ్, ఎస్ఐ సుమన్‌లకు అందిన సమాచారంతో కావలి ఉత్తర శివార్లలో లారీఆఫీస్‌కు ఎదురుగా ఆగి ఉన్న మూడు లారీలను పోలీసులు గుర్తించారు. అందులో ఉన్న బియ్యానికి బిల్లులు లేకపోవటంతో వాటిని తహసీల్దారు కార్యాలయ ఆవరణకు తరలించారు. డ్రైవర్లను విచారించగా వెంగాయ గారిపాలెం రోడ్డులోని వెంకారెడ్డి రైస్‌మిల్లులో బస్తాలను లోడ్ చేశారని, లారీ ఆఫీస్ వద్దకు బిల్లులు పంపిస్తామని చెప్పడంతో లారీలను ఆపినట్లు తెలిపారు. దీంతో మూడు లారీలలోని బియ్యం, నూకలు దించేందుకు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో ఖాళీలేక పాతురులోని సాలేహాన్ రైస్‌మిల్లుకు తరలించారు. 606 బస్తాల రేషన్ బియ్యం, 389 బస్తాల నూకలు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేశామని, ఈ వ్యవహారంలో ఉన్న వారందరి పేర్లు కేసులో చేర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.



కావలి : పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం లారీలు

● ఆధిపత్య పోరుతోనే..

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో రైస్‌మిల్లుల యాజమాన్యం మధ్య ఉన్న ఆధిపత్యపోరుతోనే ఈ వ్యవహారం బయటపడినట్లు తెలుస్తోంది. ఎండీయూ వాహనదారులు, దళారులు ఎక్కువగా వెంకారెడ్డి రైస్‌మిల్లుకే విక్రయిస్తుండటంతో దీనిని మిగతా మిల్లుల వారు జీర్ణించుకోలేక పోలీసులకు సమాచారం ఇచ్చారనే ప్రచారం జోరుగా నడుస్తోంది. రెండు రోజుల క్రితం కూడా ఆ మిల్లు సమీపంలో ఓ లారీలో 36 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

● ఉలవపాడులో 300 బస్తాలు..

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారి మీదుగా అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై అంకమ్మవివరాల ప్రకారం.. ఓ లారీలో రేషన్ బియ్యం ఒంగోలు వైపు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గుణా హోటల్ సమీపంలో పోలీసులు కాపుకాశారు. మినీ లారీలో 300 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీకి సెక్యూరిటీగా వస్తున్న ఓ కారును, అందులోని ముగ్గురిని, లారీని డ్రైవర్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

పోలీసు చొరవ

• రోడ్లపై గుంతల పూడ్చివేత



నెల్లూరు నగరంలోని రామలింగాపురం జంక్షన్‌లో, హరనాథపురం సెంటర్‌లో ప్రమాదకరంగా మారిన గుంతలను శుక్రవారం పోలీసులు పూడ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక ప్రజల సహకారంతో పోలీసు సిబ్బంది గుంతల్లో కంకర, రబ్బీస్ నింపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ట్రాఫిక్ పోలీసులు గుంతలు పూడ్చడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

- నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి)

చేప తలపై వింత ఆకృతి



గండిపాళెం జలాశయంలో మత్స్యకారుల వలకు చిక్కిన ఓ చేపపై వింత ఆకృతి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. శుక్రవారం ఉదయం డ్యాంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఓ చేప లభ్యమైంది. దాని తలపై వినాయకుడి ఆకారం ఉండటంతో అంతా వింతగా చూశారు. కొంతమంది చేపను తమ మొబైళ్లలో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

కను విందు చేస్తున్న జలపాతం



ప్రముఖ శైవక్షేత్రమైన భైరవ కోనలోని జలపాతం కను విందు చేస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతం నుంచి నీరు ఉధృతంగా కిందకు దూకుతుండడం చూసి పర్యాటకులు పరవశించిపోతున్నారు. త్రిముఖ దుర్గాంబ భర్గులేశ్వర ఆలయ ప్రాంగణంలోకి నీరుచేరింది. దీంతో జలపాతం వద్దకు భక్తులు వెళ్లకుండా దేవస్థాన కమిటీ, ఆలయ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)

నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేటలో శని, ఆదివారాలలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ శనివారం సాయం త్రం 4గంటలకు ఎస్ఎస్ కళ్యాణ మండపం నుంచి షాదిమంజిల్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, జిల్లా సమగ్రాభివృద్ధిపై ఈ సభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, టీవీ ప్రసాద్, సీఐటీయూ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలి

• 'బడిపండుగ'పై కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పూర్తిస్థాయి విద్యా వాతావర ణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు జిల్లాలోని అన్ని పాఠశాల లు సిద్ధమయ్యాయని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సన్నాహాలపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో శుక్ర వారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే కార్యక్రమాలన్నీ షెడ్యూల్ ప్రకారం పండుగ వాతావ రణంలో నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధిపై పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, విద్యా ప్రముఖులం దరినీ భాగస్వాములు చేసి పాఠశాలలకు వసతులు కల్పించేందుకు అవసరమైన విధివిధా నాలపై చర్చించాలన్నారు. ఈ సమావేశా లకు కలెక్టరేట్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్ (0861–2 331261) ఏర్పాటు చేశామన్నా రు. జిల్లాలో ఏదైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. అలాగే సమావే శాలకు సంబంధించి ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశానికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నగరంలోని నవాబు పేట బీవీఎస్ నగరపాలక బాలికోన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

- • నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్
- • విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా
- • అభివృద్ధికీ సూచనలు, సలహాల స్వీకరణ
- • తల్లిదండ్రులకు ఆటలపోటీలు.. సహపంక్తి భోజనాలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ఇప్పటికే ఐదురోజుల పాటు జిల్లావ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చేందుకు, విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లో విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించనున్నారు.



కల్యాణ మండపంలా రూపుదిద్దుకున్న వింజమూరులోని జడ్పీ హైస్కూలు



పొదలకూరు : తాము స్వయంగా చేసిన ఆహ్వాన పత్రాలను ప్రదర్శిస్తున్న పొదలకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

రారండోయ్.. పండగ చేద్దాం!

• 2,601 పాఠశాలల్లో నిర్వహణ

జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దీనికోసంగా రూ.48,67,800 నిధులను కూడా విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించామని, జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా 13 కమిటీలను ఏర్పాటు చేశామని, అన్ని పాఠశాలల్లో పండగలా కార్యక్రమ నిర్వహణ ఉంటుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

మా స్కూల్లో మీటింగ్‌కు రండి!

'మా స్కూల్లో పేరెంట్స్ కమిటీ మీటింగ్ శనివారం జరగనుంది. మా మీటింగ్‌కు మీరు తప్పకరండి' అంటూ కోవూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు శుక్రవారం ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను ఆహ్వానించారు. రికార్డు షీటులపై ఆహ్వానాలను వివిధ రకాల బొమ్మలతో చిత్రీకరించి తలిదండ్రులకు అందచేశారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



ఆహ్వాన పత్రాలతో విద్యార్థినులు

పోలీసుల్లాగే హోంగార్డులకూ ప్రయోజనాలు

• వరాలు ప్రకటించిన ఎస్పీ • ఘనంగా హోంగార్డుల దినోత్సవం

నెల్లూరు (క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో హోంగార్డు లకు ఎస్పీ జీ కృష్ణకాంత్ పలు వరాలు ప్రకటించారు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం ఈ వేడుకలు ఘనం గా నిర్వహించారు. పోలీసు వాయిద్యాల మధ్య ఎస్పీ హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, జీ మునిరాజు, డీఎస్పీలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, గట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్‌రావు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల ర్యాలీలో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీలు తదితరులు

అనేక సౌకర్యాలు కల్పిస్తాం

పోలీసుల్లాగే హోంగార్డులు కూడా పోలీస్ క్యాంటీన్‌లో సరుకులు తీసుకునేలా, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన వారికి ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు అవకాశం కల్పిస్తూ, పోలీస్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం, పిల్లలకు కళాశాలల్లో సీట్ల కేటాయింపులోనూ అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. శుక్రవారం నిర్వహించే మెన్ గ్రీవెన్స్‌ను హోంగార్డులు వినియోగించు కొని ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హోంగార్డులకు తోడుగా ఉంటానని భరోసానిచ్చారు. వరదలు, రొట్టెల పండు గ, వినాయక చవితి, తిరుమల బ్రహ్మోత్సవాలు, విజయవాడ బ్రహ్మోత్సవాలు, వీఐపీ, వీవీఐపీ బందోబస్తును క్రమశిక్షణతో నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న మహిళలు

• ఇద్దరి నుంచి రూ.35,325 లాగేసుకున్న వైనం

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాలింతలు, గర్భిణుల సైబర్ నేర గాళ్లు వల విసిరారు. దీంతో మండ లంలోని ఇరువురు బాలింతలు ఆ వలలో చిక్కుకున్నారు. శుక్రవారం మండలంలోని చీమలపెంట గ్రామానికి చెందిన పార్వతి అనే అంగన్ వాడీ కార్యకర్తకు సైబర్ నేరగాడు ఫోన్ చేసి తాను పెంట్రాల సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగిని అని గర్భిణులు, బాలింతలకు డబ్బులు వేస్తామని కొందరి ఫోన్ నంబర్లు కావాలని అడిగాడు. దీంతో ఆమె అదే గ్రామానికి చెందిన బాలింత బొల్లినేని అనూరాధ ఫోన్ చేయమని చెప్పింది. అలాగే ఆ నేరగాడు ఎర్రారెడ్డిపాలెంలో మరో బాలింత డబ్బుగొట్లు చం దన, అనూరాధకు ఫోన్ చేసి ఆరోగ్య శాఖ నుండి మీకు డబ్బులు వస్తాయని సెల్:78408 29695 ఫోన్ నంబరు ద్వారా వాట్సాప్ కాల్ చేసి, మీ బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ చెప్పాలనడంతో వారు చెప్పారు. అలాగే ఆ నేరగాడు ఒక లింక్ పంపి దానిని ఓపెన్ చేస్తే డబ్బులు వస్తాయని చెప్పారని బాధిత మహిళలు చెప్పారు. అయితే ఆ లింక్ ఓపెన్ చేయగానే అనూ రాధ బ్యాంకు ఖాతా నుండి రూ.15,400లు, చందన బ్యాంకు ఖాతా నుండి రూ.19,925లు లాగేసుకున్నాడని గుర్తించారు. దీంతో వారు మోసపోయా మని గుర్తించారు. అయితే ట్రూ కాలర్‌లో ఆ నేరగాడి పేరు మిస్టర్ చౌదరి అని పడిందని చెప్పారు. అనంతరం వారు సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే ఆరోగ్యశాఖలో పని చేసేవారే ఈ నేరాలకు పాల్పడి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కాలువ పూర్తయ్యేనా.. నీటి కష్టాలు తీరేనా!?

- • బండేపల్లి-దేగపూడి కాలువ పనులకు గ్రహణం
- • మట్టి పనులు చేసి ఆపేసిన కాంట్రాక్టర్
- • గత ప్రభుత్వంలో సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వైసీపీ నేత
- • పనులు చేయకపోవడంతో నోటీసులిచ్చిన అధికారులు
- • అయినా పనులు మొదలుపెట్టని వైనం
- • తాజాగా సీఈకి లేఖ రాసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మనుబోలు, పొదలకూరు మండలాల్లోని కనుపూరు కాలువ చివరి ఆయకట్టు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కనే కండలేరు కాలువ ఉన్నప్పటికీ ఆ నీటిని ఉపయోగించుకోలేని దుస్థితి రైతాంగానిది. తమకు ఇబ్బంది లేకుండా కండలేరు కాలువ నుంచి కనుపూరు కాలువకు లింకు కాలువను నిర్మించాలని ఎప్పటినుంచో ఆ ప్రాంతాల రైతులు కోరుతున్నారు. ఎట్టకేలకు 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ కాలువకు మోక్షం లభించింది. అప్పట్లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూ.30 కోట్లతో బండేపల్లి-దేగపూడి కాలువ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించడంతో రైతులంతా సంతోషించారు. అనుకున్నట్లుగానే వేగంగా టెండర్లు పిలిచి 2019 ప్రారంభంలో పనులు కూడా మొదలుపెట్టారు. కొంత పనులు జరిగాక ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ కాలువకు మళ్లీ గ్రహణం పట్టుకుంది. ఏడాదిలో పూర్తి చేయాల్సిన కాలువను ఐదేళ్లయినా పూర్తి చేయలేకపోయారు.

అర్ధంతరంగా ఆగిన పనులు

బండేపల్లి-దేగపూడి కాలువను రూ.26 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా 11.7 శాతం లెస్‌కు కడప జిల్లాకు చెందిన ఓ సంస్థ పనులు దక్కించుకుంది. పొదలకూరు, సైదాపురం, మనుబోలు మండలాల్లో 9.27 కిలోమీటర్ల మేర కాలువను తవ్వాల్సి ఉంది. ఈ కాలువపై పలు చోట్ల స్ట్రక్చర్లు నిర్మించాలి. కొన్నిచోట్ల లైనింగ్ చేయాలి. అయితే ఇప్పటి వరకూ 5.35 కిలోమీటర్లమేర కాలువను తవ్వారు. కానీ కాంక్రీట్ పనులు మాత్రం చేయలేదు. ఇప్పటి వరకూ సుమా రు రూ.7.8 కోట్ల పనులు జరిగాయి. మొత్తం 148 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే 94 ఎకరాలను ఇరిగేషన్ శాఖకు అప్పగించారు. మిగిలిన 54 ఎకరాల్లో 14 ఎకరాలు డీకేటీ భూములు ఉండగా మరో 40 ఎకరాలు పట్టా భూములున్నాయి. ఈ భూముల సేకరణకు సంబంధించి ఇరిగేషన్ శాఖ రిక్విజిషన్‌ను ఆర్డీవోకు పంపి ఉన్నారు. ఆ ప్రక్రియ జరుగుతోంది.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాఫీగా జరుగుతున్న పనులకు బ్రేకులు పడ్డాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టర్.. రాజకీయ జోక్యంతో పనులు ఆపేశారు. చాలా కాలం పాటు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఆ తర్వాత బండేపల్లి-దేగపూడి కాలువ పనులను పొదలకూరు మండలానికి చెందిన ఓ వైసీపీ నేత సబ్ కాంట్రాక్ట్ కింద తీసుకున్నారు. ఒక కిలోమీటరు మట్టి పనులు చేసి వదిలేశారు. ఆ తర్వాత ఈ వర్కును రివైజ్ కూడా చేశారు. అయినా కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టలేదు. ఓ వైపు రైతులు, మరోవైపు ఇరిగేషన్ అధికారులు ఎన్నిసార్లు చెప్పిన కాంట్రాక్టర్ నుంచి స్పందన లేదు. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు కూడా నోటీసులు ఇవ్వకుండా మిన్నకుండిపోయారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే గడువు ముగి యడంతో ఇటీవల ఎక్స్‌టెన్షన్(ఈవోటీ) కూడా తెచ్చుకున్నారు. అయిన ప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీనిపై సమీక్షించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పనులు మొదలుపె ట్టించి రైతాంగం ఇబ్బందులు తీర్చాలని తిరుపతి సీఈకు లేఖ రాశారు. అ తర్వాత గానీ ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వలేదు. పోనీ ఆ తర్వాతనైనా పనులు మొదలుపెట్టారా..? అంటే ఇప్పటికీ లేదు. దీంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. కాంట్రాక్టర్ చేత పనులు చేయించడమో.. లేక రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచి పనులు మరొకరికి అప్పగించ డమో చేయాలని రైతులు కోరుతున్నారు.



బండేపల్లి-దేగపూడి కాలువ పనులు (ఫైల్)

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

• 6 ద్విచక్ర వాహనాల స్వాధీనం

కందుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన గుంటక మాల్యాద్రి అనే మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసి అతని వద్ద 6ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తెలిపారు. పట్టణంలోని అంకమ్మ ఆలయం వద్ద పాశం నవీన్ అనే యువకుడు ఓ మెడికల్ షాపు ముందు పెట్టిన మోటారు సైకిల్ ఇటీవల అపహరణకు గురైంది. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామన్నారు. నిందితుడు మోటారు సైకిళ్లను కందుకూరు, పొన్నలూరు, భీమవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాలలో దొంగిలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మాల్యాద్రిని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు పంపామన్నారు.



పట్టుబడిన మోటారుసైకిళ్లు, నిందితుడితో కందుకూరు పట్టణ పోలీసులు

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అప్రమత్తంగా ఉండండి

● ఒంగోలు ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి

లింగసముద్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : రాళ్ల పాడు ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం వస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఈ రాళ్లపాడును సందర్శించి ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. అలాగే ప్రాజెక్టులోకి ఎంత మేరకు నీటి ప్రవాహం వస్తుందనే వివరాలు డీఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. నీరు దిగువకు విడుదల సమయంలో మన్నేరు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. ఇన్‌ఫ్లోను బట్టి అవుట్‌ఫ్లోను వదలాలన్నారు. అనంతరం ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వే గేట్లను పరిశీలించి వాటి పనితీరు గురించి అడిగారు. కార్యక్రమంలో మరో డీఈ మధుసూదనరావు, ఏఈలు చంద్రమౌళి, నవీన్ పాల్గొన్నారు.

దివ్య జ్యోతుల ఊరేగింపు

ఉలవపాడు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 6: స్థానిక కనకదుర్గమ్మ దివ్యజ్యోతుల ఊరేగింపు శుక్రవారం రాత్రి పురవీధుల్లో వైభవంగా జరిగింది. భవాని మాలధారులు, అమ్మవారి భక్తులు పాత రైల్వేరోడ్డులోని విఘ్నేశ్వరుని గుడి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 10గంటలకు అయ్యప్ప, భవాని, గోవింద, శివయ్య మాలధార స్వాములు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రవేశం చేశారు.

బైక్ ఢీకొని ఒకిరికి తీవ్రగాయాలు

కావలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ ఢీ కొని చలంచర్ల సలేంద్రయ్య తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణ సమీపంలోని పెద్దపవని రోడ్డులో జరిగింది. వివరాల మేరకు.. లింగసముద్రం మండలం ముత్తం వారి పాలెంకు చెందిన ఈయన పట్టణ వైద్యశాలలోని బంధువులను పరామర్శించేందుకు వచ్చాడు. స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు ఉదయగిరి రోడ్డులో నుండి పెద్దపవని రోడ్డులోని వైకుంఠపురం వైపుకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక వైపున నుంచి పల్సర్ బైక్ వచ్చి ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సలేంద్రయ్యను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. మోటారు బైక్ నడుపుతున్న యువకుడు వాహనాన్ని సంఘటనా స్థలంలో వదిలి వెళ్లిపోయాడు.

ప్రతిభా విద్యార్థికి ప్రోత్సాహకం

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రెస్లింగ్ పోటీలకు ఎంపికైన కప్పరాళతిప్ప అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని దర్శి శ్రీలతకు శుక్రవారం యూనియన్ సభ్యులు నగదు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు ఏపీఈఆర్‌యూ జిల్లా అధ్యక్షులు డోలా శ్రీహరిప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లు రాజేంద్రప్రసాద్, జైభీం బత్తుల రవిచంద్ర, లేళ్ళపల్లి వేణు, కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు అనురాధ, అలివేలుమంగతాయారు, పీఈటీ సులోచన, అలినిషా తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ పుణ్యమే.. సమానత్వం

● అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించిన నాయకులు

అల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సమాజంలో అందరితో పాటు సమానంగా జీవించడం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చేసిన పుణ్యమే అని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి శ్రీని వాసులు రెడ్డి, కృష్ణచైతన్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, తిరువీధి అనూరాధ, పరంధామిరెడ్డి, కావలి జగన్, జనసేన మండలాధ్యక్షుడు కార్తీక్ శర్మ, ఇస్మాయిన్, నజీర్‌బాషా పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరేంద్ర, పంగులూరు సుధాకర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

● కావలి: పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో ముసునూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్ర మంలో నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, యేగూరి చంద్రశేఖర్, మొగిలి కల్లయ్య పాల్గొన్నారు. అలాగే ముసునూరు వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నేతలతో కలిసి నిర్వహించిన కార్యక్ర మంలో కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారా యణ, గ్రంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు. బీసేపీ ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, మందా కిరణ్ పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో సమ్మిన వెంకటసుబ్బయ్య పులువురు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కా ర్యాలయంలో ఆర్డీవో వంశీక్రిష్ణతో పాటు పరిపాలనాధికారి సూర్యనారాయణ సింగ్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు పులి రాఘవులు, ఇతర టీడీపీ నేతలు పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ప్రభావతి, ప్రసాద్, చిన కొం డయ్య, సీహెచ్ బాలకోటయ్య, గురునాథం, మాలకొండయ్య, మాజీ ఎంపీపీ బాలకోటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండలకేంద్రం, కరేడు, కొల్లా రుపాడు, ఆత్మకూరు, చాకిచర్ల, చాగొల్లు, వీరేపల్లి, భీమవరంలో అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు నివాళుల ర్పించారు.

● బిట్రగుంట: స్థానిక బజారులోని జరిగిన కార్య క్రమంలో దళిత నేతలు, ఉద్యోగులు నివాళులర్పించారు. వైద్యులు కొర్రా చంద్రశేఖర్, ఉద్యోగులు గంగాధర్, వెంకటేశ్వర్లు, పెంచలయ్యతో పాటు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్ ఉన్నారు. దళిత నేతలు శెట్టిపల్లి మల్లి, బత్తుల రవిచంద్ర, బుర్రి వెంకట రావు వేర్వేరుగా చోట్ల నివాళులర్పించారు.

● జలదంకి: బ్రాహ్మణక్రాకలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, వీఆర్వో మణికంత, యూత్‌సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● కందుకూరు: స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఏపీడీ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చనమాల కోటేశ్వరరావు, గేరా చిరంజీవి, గాండ్ల హరిప్రసాద్, గేరా మనోహర్, రేణమాల అయ్యన్న, ముప్పవరపు కిషోర్, శీలం సుధీర్, వైసీపీ నాయకుడు రావులకొల్లు బ్రహ్మానందం పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీనివాసరావు, షేక్ రఫీ, కూనం నరేంద్ర, బెజవాడ ప్రసాదు, చుండూరి శ్రీనివాసరావు, నత్తా తిరుమలరావు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలోను పార్టీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు:కరటంపాడులో సర్పంచ్ రేవతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం :బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కృష్ణ తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరసయ్య, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

● కలువాయి : అంబేడ్కర్ ధర్మపోరాట సమితి సభ్యులు బస్టాండు సెంటర్ నిర్వహించిన కార్యక్రమంలో ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్, గొల్లపల్లి నరసయ్య, ఏఎస్ఐ రమణయ్య, రిటైర్డ్ టీచర్ వజ్రాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలోని విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా, బాలగురవయ్య, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు శంకర్‌లు నివాళులర్పించారు.

● దుత్తలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి తహసీల్దారు నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● వింజమూరు : మండల కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ వర్ధంతి నిర్వ హించారు. నందిగుంటలో సెక్రటరీ, సిబ్బంది నివాళులర్పించారు.

● అనంతసాగరం: సోమశిల, అనంతసాగరం రాజు కాలనీలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష, గాడి సుధాకర్, చిన్నయ్య, చంద్రశేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్ననాయకులు



కావలి: ట్రంకు రోడ్డులో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, నేతలు

తల్లిదండ్రుల సమావేశాలకు సర్వంసిద్ధం

వింజమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు ముస్తాబైంది. మామిడి తోరణాలు అరటి పిలకలతో అలంకరించారు. ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో పండుగ వాతారణం కల్పించే విధంగా ముస్తాబు చేశామని తెలిపారు.

● కలిగిరి: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భీమేశ్వరరావు తెలిపారు. తల్లిదద్రులందరూ విద్యార్థులతో కలిసి తరగతిగదిలో కూర్చోవడం, తల్లిదండ్రులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించడం, విద్యార్థుల ప్రగతిని వారికి తెలియజేస్తామన్నారు. పూర్వ విద్యార్థుల విజయ గాథలు, సైబర్‌నేరాలపై అవగాహన, పాఠశాల ప్రగతి నివేదిక అంశాలను చర్చిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న సహపంక్తిభోజనం ఉంటుందన్నారు.

● కొండాపురం: మండలంలోని 65పాఠశాలలను కలిసి మెగా పేరంట్స్ డే కార్యక్రమంను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 కె.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందజేసినట్లు చెప్పారు.

ముగిసిన రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే సెక్షన్ పరిధిలో మూడు రోజులుగా జరుగుతున్న రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్‌యాదవ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహేష్, శ్రీహరి ఒకవైపు.. ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి తిరుమలశెట్టి రాజశేఖర్, కోశాధికారి కిరణ్‌కుమార్, వరప్రసాద్‌లు మరోవైపు జోరుగా ఓట్ల సాధనకు కృషి చేశారు. 849 మంది వివిధ శాఖలో రైల్వే కార్మికులు ఉండగా 722 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

మాదాలకు ఘన నివాళులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మాదాల జానకిరాం వర్ధంతి వేడుకలను శుక్రవారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ప్రగతి ఛారిటబుల్ సంస్థలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదాల బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతారామపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగులు వంకలు దాటకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. బాలాయపల్లి గ్రామ పంచాయతీలోని రంగనాయుడు పల్లి వాగును శుక్రవారం ఎరిశీలించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఏఎస్ పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంగం సిఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పర్యటించనున్నట్లు ఆయా మండలాల టీడీపీ కన్వీనర్లు చింతనబోయిన బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్, రెవెన్యూ సదస్సులో పాల్గొంటారన్నారు. అలాగే దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరవుతారన్నారు. ఆయా మండలాల్లోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

యంత్ర సామగ్రి అందుబాటులో ఉంచాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మార్కెట్ యార్డు పరిధిలోని పసుపు రైతుల సౌకర్యార్థం అవసరమైన యంత్ర సామాగ్రిని అందుబాటులో ఉంచాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు రైతులు మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ పసుపు ఉడక బెట్టేందుకు బాయిలర్స్, పాలిష్ మిషన్‌లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ యంత్రాలను ప్రస్తుతం రైతులు కడప, కృష్ణా జిల్లాల నుంచి అద్దెకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా యంత్రాలను ఏర్పాటుచేస్తే రైతులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సదస్సును జయప్రదం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ ప్రాజెక్టు సాధన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆదివారం కడప పట్టణంలో నిర్వహించే అఖిలపక్ష సదస్సును జయప్రదం చేయాలని వెలుగొండ సాధనసమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో సదస్సుకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు 14న ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరుతుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఒక్కొక్కరికి రానుపోనూ రూ.1,650లు చార్జీ నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని సీతారామపురం మార్గంలో ఏర్పాటు చేసిన గిఫ్టుబాక్సు లక్కీడ్రాలో విజేతలకు శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను ఆర్టీసీకి మరింత చేరువ చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది రక్తదానం

కావలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యార్థులను మినహాయిస్తే రక్తదానం చేయటంలో బ్యాంకులు, ఎల్‌ఐసీ ఉద్యోగులు అగ్రస్థానంలో ఉన్నారని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి సిబ్బందిని అభినందించారు. బ్యాంకు మేనేజరు ఏ లక్ష్మీనారాయణ, పీ. ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు ఎస్‌కే అమన్సీ, ఎం. దిలీప్, జే.మనోహర్, షేహెచ్ ఫణికుమార్, కే. సాయికుమార్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మాజీఎమ్మెల్యే

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేష్‌బాబును శుక్రవారం కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. శివరాం వెంట ఆయన సతీమణి దివి సౌభాగ్యతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఉన్నారు.

ఉద్యాన రైతుల ఆర్థిక చేయూతకే రాయితీలు

జ్యోతి, మండల ఉద్యాన అధికారి



ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే ప్రభుత్వం మెరుగైన రాయితీలు కల్పించింది. ఈ అవకాశాలను రైతులు అందిపుచ్చుకుని ఆధునిక పద్ధతు లతో పంటల సాగును విస్తరించుకోవాలన్నారు.

? అధికంగా సాగులో ఉన్న పంటలు ఏవి.

! మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో మామిడి, 1300 ఎకరాల్లో సపోటా ప్రధాన పంటలుగా సాగులో ఉన్నాయి.

? సపోటా సాగుకంటే మామిడి పంట సాగుపై మక్కువకు కారణం.

! మండలంలో గత 15 ఏళ్ల క్రితం సపోట సాగు, మామిడి సాగు రమారమి ఒకటిగానే ఉండేది. పునాస దాదాపు ఏడాడిపాటు పంట కాపు వస్తుంది. దీనికితోడు పనాస జూలై, ఆగస్టు మాసాల్లో టన్ను రూ.70వేల వరకు పలకడం రైతుల్లో పనాస మామిడి సాగుపై మక్కువ పెంచుకుని సాగు చేస్తున్నారు. మండలంలో సపోటా సాగు తగ్గిపోయింది.

? ఉద్యాన రైతులకు ప్రభుత్వం ఏ రకమైన రాయితీలు ఇస్తుంది.

! నూతన ఉద్యాన తోటలు పెంపకం కింద ప్రభుత్వం రైతులకు సబ్సిడీ సౌకర్యం కల్పిస్తుంది. మామిడి తోటలు పెంచుకునే రైతులకు హెక్టారుకి మొక్కలు కొనుగోలు చేసి నాటుకునే వరకు తొలి ఏడాది రూ.7920 రాయితీ, రెండు, మూడు ఏడాదిల్లో వరసగా రూ.2660 చొప్పున తొలి మూడేళ్లల్లో రూ.13,300 రాయితీ అందిస్తుంది.

? ఎక్కువ పొలం ఉన్నోళ్లకి..

! 5ఎకరాలలోపు ఉన్న మామిడి రైతులకు కాయల గ్రేడింగ్, ప్యాకింగ్ కోసం ప్యాక్ హౌస్ నిర్మాణంలో 50 శాతం సబ్సిడీతో రూ.2లక్షలు రాయితీ కల్పిస్తుంది. ఎక్కువ కమతం ఉన్న రైతులకు పంట గ్రేడింగ్, ప్యాకింగ్, ఎగుమతులు చేసుకునే సౌకర్యం కోసం 40శాతం సబ్సిడీతో రూ.6లక్షల రాయితీ రైతులకు అందిస్తుంది.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

● ఆత్మకూరు ఆర్డీవో పావని

సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను చేపట్టిందని ఆత్మకూరు ఆర్డీవో పావని పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పెరమన గ్రామ పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సమస్యల తీరును బట్టి గడువు లోపు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ప్రత్యేకాధికారి రమేష్ నాయక్, తహసీల్దారు సోమ్లా నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తోపుగుంటలో..

కలువాయి: తోపుగుంటలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జనం నుంచి స్పందన కనిపించలేదు. కొద్దిమంది మాత్రమే హాజరై తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్ సుందర్‌రాజు, డీటీ మంజుల, వీఆర్వో అరుణమ్మ పాల్గొన్నారు.



కొండాపురం: సదస్సులో పాల్గొన్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అన్నవరంలో రైతు నుండి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల

● సీతారామపురం: మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామ పంచాయతీలోని చింతోడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

● కలిగిరి: భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహసీల్దారు రవీంద్రబాబు కోరారు. శుక్రవారం తూర్పుదూబగుంటలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులతో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అన్నపూర్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● అన్నవరంలో..

జలదంకి: అన్నవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ రకాల భూ సమస్యలపై 22 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రమీల మాట్లాడారు. 45రోజులలో పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీజ, వీఆర్వో గిరి, మండల టీడీపీ అధ్యక్షుడు పి.మదురెడ్డి, టీడీపీ నేతలు పి.బాస్కర్‌రెడ్డి, పి.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదిమూర్తిపురంలో..

కొండాపురం: ఆదిమూర్తిపురంలో జరిగిన రెవెన్యూ సదస్సును కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగిన సదస్సుకు బండ్లబాట ఆక్రమణ, ఆలయ భూమి ఆక్రమణ, తన భూమిని ఆన్‌లైన్లో నమోదు చేయాలంటూ ముగ్గురు రైతులు వినతులు అందజేసినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు.

● రెవెన్యూ గ్రామసభకు 15 వినతులు

ఉలవపాడు: బద్దిపూడిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 15 వినతులు వచ్చినట్లు తహసీల్దారు లావణ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామసభల ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, డిప్యూటీ లేబర్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భూ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు, ముటేషన్, పలు రెవెన్యూ సమస్యలపై స్థానికులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఖాదర్ హుసేన్, వీఆర్‌వో రవి కుమార్, కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.



పెరమన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పావని



ఉలవపాడు: పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటి లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

● కావలి రూరల్: రుద్రకోటలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీక్రిష్ణ, మండల ప్రత్యేక అధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సచివాయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రం : ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీతా మహాలక్ష్మి తెలిపారు. మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురంలో జరిగిన సదస్సులో ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓ అమానుల్లాఖాన్, సర్వేయరు వెంకటేష్ పాల్గొన్నారు.